

నోరు లేని మేకల్నే బలి ఇస్తారు.
సింహాల్ని బలివ్వరు, గుర్తించుకోండి.
- డా. బిఆర్ అంబేద్కర్


REGD NO : APTEL 16144

# జన స్వరం

పవర్

అక్షరమే ఆయుధం ✍

www.Janaswaram.com



జనస్వరం న్యూస్ తెలుగు వారపత్రిక ద్వారా తక్కువ ఖర్చుతో పుట్టినరోజు శుభాకాంక్షలతో పాటు అన్నీ కార్యక్రమాలకు ప్రకటనలకు సంప్రదించండి.
మా మెయిల్ ఐడి : janaswaramnews@gmail.com
మొబైల్ నెంబర్ : 9642067900



సంపుటి : 4 | సంచిక : 321 | ఎడిటర్ : నరేష్ సాకే | వార సంచిక : 04 - 06 - 2025 | పేజీలు : 5


# 18 ఏళ్ల నిరీక్షణకు తెర : ఆర్సీబీ తొలి కప్

**- 18 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఆర్సీబీ తొలి ఐపీఎల్ టైటిల్ కైవసం**

**- అహ్మదాబాద్‌లో జరిగిన ఫైనల్‌లో పంజాబ్ సూపర్ కింగ్స్‌పై ఉత్కంఠ విజయం**

**- బెంగళూరు నగరం మొత్తం హోరెత్తిన విజయోత్సవాలు, రోడ్లపైకి అభిమానులు**

**- కోహ్లీ 18 ఏళ్ల అంకితభావమే ఈ విజయానికి కారణమన్న ముఖ్యమంత్రి సిద్ధరామయ్య**

**- ఆర్సీబీ జట్టుకు శుభాకాంక్షలు తెలిపిన ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్**

**- సంబరాల నేపథ్యంలో బెంగళూరులో కట్టుదిట్టమైన పోలీసు భద్రత**

**అహ్మదాబాద్, జూన్ 3, జనస్వరం :** ఈ సాల కప్ నమదే (ఈ ఏడాది కప్ మనదే) అంటూ... 18 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) జట్టు తొలిసారి ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ట్రోఫీని కైవసం చేసుకుంది. అహ్మదాబాద్‌లో ఉత్కంఠభరితంగా జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో పంజాబ్ సూపర్ కింగ్స్‌పై



అద్భుత విజయం సాధించి, బెంగళూరు నగరానికి చిరస్మరణీయమైన రాత్రిని అందించింది. ఈ చారిత్రక విజయంతో నగరం మొత్తం సంబరాల్లో మునిగిపోయింది. మ్యాచ్ ముగిసిన వెంటనే బెంగళూరు వీధులు జనసంద్రంగా మారాయి. అభిమానులు జెండాలు ఊపుతూ, బాణాసంచా కాలుస్తూ, నినాదాలతో హోరెత్తించారు. ఇందిరానగర్ నుండి కోరమంగళ వరకు, ఎంజీ రోడ్ నుండి బ్రిగేడ్ రోడ్ వరకు నగరం మొత్తం ఎరుపు, బంగారు వర్ణాలతో నిండిపోయింది. అభిమానుల పాటలు, నృత్యాలు, కేరింతలతో రాత్రంతా సందడి వాతావరణం నెలకొంది. చర్చ్ స్ట్రీట్‌లోని పబ్‌లు, కేఫ్‌ల వద్ద వందలాది మంది అభిమానులు గుమిగూడి మ్యాచ్ చివరి క్షణాలను వీక్షించారు. ఆర్సీబీ గెలుపు ఖరారైన వెంటనే, అపరిచితులు సైతం ఆనందంతో ఒకరినొకరు ఆలింగనం చేసుకున్నారు. యువకులు బాణాసంచా కాల్చగా, "ఈ సాలా కప్ నమదే!" నినాదాలు మిన్నంటాయి. సోషల్ మీడియాలో షేర్ అయిన వీడియోలు అక్కడి ఉద్విగ్న వాతావరణాన్ని కళ్లకు కట్టాయి. "ఇది దీపావళి కాదు, బెంగళూరులో ఆర్సీబీ దివస్!" అని ఒక యూజర్ పోస్ట్ చేయగా, "బ్రిగేడ్ రోడ్ ఇంత సజీవంగా ఎప్పుడూ కనిపించలేదు - 18 ఏళ్ల ఆశ, నమ్మకం, అభిరుచి చివరికి ఫలించాయి!" అని మరో యూజర్ రాశారు. ముఖ్యంగా కోరమంగళ, ఇందిరానగర్ ప్రాంతాల్లో బైక్‌లు, కార్లపై ఆర్సీబీ జెండాలతో అభిమానులు ప్రదర్శనలు నిర్వహించారు. దాదాపు రెండు దశాబ్దాలుగా జట్టుకు అండగా నిలిచిన విరాట్ కోహ్లీ పేరుతో నినాదాలు చేశారు. "ఈ క్షణం కోసం 18 ఏళ్లు ఎదురుచూశాం! ఇది కలో నిజమో అర్థం కావడం లేదు," అని జేపీ నగర్‌లోని ఓ స్పోర్ట్స్ బార్ బయట ఓ అభిమాని తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. రాష్ట్ర నాయకులు కూడా ఈ సంబరాల్లో పాలుపంచుకున్నారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తన సంతోషాన్ని వ్యక్తం చేస్తూ, "ఆర్ఆర్ఆర్.... సీసీసీ.... బీబీబీబీబీబీ.... పంజాబ్‌ను ఓడించి ఎట్టకేలకు ఐపీఎల్ ట్రోఫీని గెలుచుకున్న ఆర్సీబీకి అభినందనలు. విరాట్ కోహ్లీ 18 ఏళ్ల అంకితభావంపై ఈ విజయం నిర్మితమైంది. ప్రతి ఆర్సీబీ ఆటగాడు నిజమైన ఛాంపియన్‌లా ఆడాడు. ఇది చారిత్రక రోజు. ఈ సాలా కప్ నమ్దే!" అని పేర్కొన్నారు. ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కూడా, "18 ఏళ్ల నిరీక్షణ... ఇది విలువైనది. ధన్యవాదాలు, ఆర్సీబీ!" అంటూ తన స్పందనను తెలిపారు. నగరవ్యాప్తంగా సంబరాలు



మిన్నంటుతున్న వేళ, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బెంగళూరు పోలీసులు అదనపు సిబ్బందిని మోహరించి, భద్రతను కట్టుదిట్టం చేశారు. ఆర్సీబీ విజయం కేవలం కరువు తీర్చడమే కాకుండా, నగరాన్ని ఆనందంలో ఏకం చేసింది. కష్టసుఖాల్లో జట్టుకు అండగా నిలిచిన లక్షలాది మంది అభిమానులకు ఈ విజయం కేవలం ట్రోఫీ మాత్రమే కాదు

ఐపీఎల్ ఆరంభం నుంచి టైటిల్ కోసం అలుపెరగని పోరాటం చేస్తున్న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, ఎట్టకేలకు తమ లక్ష్యాన్ని చేరుకుంది. మంగళవారం అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో జరిగిన ఐపీఎల్ 2025 ఫైనల్ పోరులో పంజాబ్ కింగ్స్‌పై సమష్టి ప్రదర్శనతో విజయం సాధించింది. 2008 నుంచి ఊరిస్తున్న ఐపీఎల్ ట్రోఫీని 18వ ప్రయత్నంలో సొంతం చేసుకుంది. ఈ చారిత్రక విజయంతో ఆర్సీబీ ఆటగాళ్లు, యాజమాన్యం, కోట్లాది మంది అభిమానులు ఆనందోత్సాహాల్లో మునిగిపోయారు. 191 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన పంజాబ్ కింగ్స్‌కు శుభారంభం దక్కింది. ఓపెనర్లు తొలి 3.4 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 31 పరుగులు జోడించారు. అయితే, ఐదో ఓవర్‌లో జోష్ హేజిల్‌వుడ్ పంజాబ్‌ను దెబ్బతీశాడు. 24 పరుగులు చేసిన ప్రియాంశ్ ఆర్యను అవుట్ చేయడంతో పంజాబ్ 43 పరుగుల వద్ద తొలి వికెట్ కోల్పోయింది. అనంతరం ఆర్సీబీ బౌలర్లు క్రమంగా పట్టు బిగించారు. పంజాబ్ ఇన్నింగ్స్ 15 ఓవర్లు ముగిసేసరికి 4 వికెట్ల నష్టానికి 119 పరుగులు చేసింది. ఆ సమయంలో క్రీజులో శశాంక్ సింగ్ (9 బంతుల్లో 10), నెహాల్ వధేరా (13 బంతుల్లో 14) ఉన్నారు. చివరి 30 బంతుల్లో పంజాబ్ విజయానికి 72 పరుగులు అవసరమవగా, అప్పటికే అవసరమైన రన్ రేట్ 14.40కి చేరింది. ఆర్సీబీకి సపోర్ట్ చేస్తూ కనిపించారు. బెంగళూరు టీమ్ ను అడుగడుగునా ప్రోత్సహిస్తూ ఆయన మ్యాచ్ ను బాగా ఎంజాయ్ చేశారు. ఇలాంటి క్రికెట్ అనుభూతిని ఎప్పుడూ పొందలేదని రిషి సునాక్ వ్యాఖ్యానించారు. ఇలాంటి క్రికెట్ అనుభూతిని ఎప్పుడూ పొందలేదని రిషి సునాక్ వ్యాఖ్యానించారు.

# 'యోగా డే'పై ప్రజా స్పందన ఉత్సాహాన్నిస్తోంది : సీఎం చంద్రబాబు

**అమరావతి, జూన్ 3, జనస్వరం :** ఈ నెల 21వ తేదీన ఏపీలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ యోగా డే కార్యక్రమానికి ప్రజల నుంచి వస్తున్న స్పందన ఎంతో ఉత్సాహాన్ని ఇస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు జరిగిన రిజిస్ట్రేషన్లు, జిల్లాల్లో జరుగుతున్న యోగా సాధన కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యం సంతృప్తికరంగా ఉందని తెలిపారు. పూర్తి స్థాయి సన్నద్ధతతో, ప్రజల భాగస్వామ్యంతో అత్యధిక మందితో యోగా నిర్వహించి గిన్నీస్ వరల్డ్ రికార్డు సృష్టించాలనే లక్ష్యాన్ని పూర్తి చేయాలని సీఎం నిర్దేశించారు. జూన్ 21న విశాఖలో 5 లక్షలమంది పాల్గొనేందుకు అవసరమైన ఏర్పాట్లు పక్కాగా జరగాలని సూచించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ రాక సందర్భంగా ట్రాఫిక్ పరంగా ఆంక్షలు ఉంటాయని... వీటిని దృష్టిలో పెట్టుకుని ఇబ్బంది లేకుండా చూడాలని సీఎం అన్నారు. అన్ని ప్రాంతాల నుంచి ప్రజలు యోగా డే కార్యక్రమానికి వస్తారని... ఎవరు ఎటు వెళ్లాలి... ఎక్కడ కార్యక్రమంలో పాల్గొనాలి... అనే విషయంలో ముందుగానే గైడ్ చేయాలని సీఎం అన్నారు. ట్రాఫిక్ సహా ఏ ఇబ్బందీ ఉండకూడదు... అందరూ నిర్ధేశించిన ప్రాంతానికి చేరుకునేలా చూడాలని స్పష్టం చేశారు. యోగా డే కంటే ముందు రెండు సార్లు రాష్ట్ర స్థాయిలో భారీగా ప్రీ ఈవెంట్ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. "7వ తేదీ ప్రతి గ్రామంలో, ప్రతి ప్రాంతంలో యోగా డే అవగాహనా ర్యాలీలు నిర్వహిస్తారు. 14 వతేదీ రాష్ట్రంలో లక్ష ప్రాంతాల్లో యోగా ప్రాక్టీస్ చేస్తారు. ప్రతి విద్యా సంస్థతో పాటు అవకాశం ఉన్న అన్ని సంస్థలు, ప్రాంతాల్లో 14వ తేదీ యోగా నిర్వహించి యోగా డేకు ప్రజలను సిద్దం చేస్తారు. తద్వారా యోగా డే కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొనేలా చేయాలి" అని సీఎం వివరించారు. మంగళవారం ఉండవల్లి క్యాంప్ కార్యాలయంలో యోగా డే కార్యక్రమంపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్షించారు. ఈ సమీక్షకు మంత్రులు నారా లోకేశ్, కందుల దుర్గేశ్, వంగలపూడి అనిత, డోలా బాలవీరాంజనేయస్వామి, సత్యకుమార్, సీఎస్ విజయానంద్, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా హాజరయ్యారు. యోగా మంత్‌లో భాగంగా ఇప్పటి వరకు వివిధ స్థాయిల్లో జరిగిన కార్యక్రమాలను, యోగా డే నిర్వహణకు తీసుకుంటున్న చర్యలను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. రోజుకో థీమ్‌తో వివిధ వర్గాల ప్రజలతో జిల్లాల్లో నిర్వహిస్తోన్న కార్యక్రమాలకు వస్తున్న స్పందనను అధికారులు వివరించగా... చంద్రబాబు సంతృప్తి వ్యక్తం చేశారు. 21వ తేదీన విశాఖలో వర్షం వచ్చినా ఇబ్బంది లేకుండా చేసేందుకు జర్మన్ హ్యాంగర్లతో మరో వేదిక సిద్ద చేసినట్లు అధికారులు తెలిపారు. ఏర్పాట్లపై స్పెషల్ చీఫ్ సెక్రటరీ కృష్ణబాబు వివరిస్తూ..."ప్రతి గ్రామం నుంచి యోగాలో పాల్గొనేందుకు రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. అనుకున్న లక్ష్యానికి మించి ఔత్సాహికులు రిజిస్ట్రేషన్లు చేసుకుంటున్నారు. యోగా కార్యక్రమంలో మూడు రోజుల పాటు పాల్గొనేవారికి సర్టిఫికెట్లు ఇస్తున్నాం. యాప్ ద్వారా కూడా ప్రజలు యోగా సర్టిఫికెట్ పొందవచ్చు. విద్యార్థులు, మహిళలు, డ్వాక్రా సంఘాలు, సామాన్య ప్రజలు... ఇలా అన్ని వర్గాలు విశాఖ కార్యక్రమంలో పాల్గొననున్నారు. రెండు కోట్లమంది రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో యోగా కార్యక్రమంలో పాల్గొంటారని అంచానా వేస్తున్నాం. రెండు కోట్ల మందికి రిజిస్ట్రేషన్ చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా... ఇప్పటి వరకు 1.77 కోట్ల మంది రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు. మొత్తం 2,600 మంది మాస్టర్ ట్రైనర్లు సిద్ధం చేయాలని లక్ష్యం పెట్టుకోగా... 5,353 మందిని గుర్తించాం. వీళ్ల ద్వారా 1.25 లక్షల మందిని ట్రైన్ చేయాలని లక్ష్యంగా



పెట్టుకోగా... 1.48 లక్షల మందికి ట్రైనింగ్ ఇచ్చారు. మూడు పాటు యోగా సాధన చేసిన వారికి ఆటోమేటిక్ గా సర్టిఫికెట్ వేళ్లేలా ఏర్పాట్లు చేయడం జరిగింది. అదే విధంగా కాంపిటేషన్స్ విషయంలో కూడా అనుకున్న మేర లక్ష్యాలను చేరుకున్నాం" అని సీఎం చంద్రబాబుకు వివరించారు.

## జీవితం - వి "చిత్రం"




## ఈరోజు పంచాంగం వేళలు

**తేదీ : 04 జూన్ 2025**

**తిథి : శుద్ధ విదియ ( మ : 2.01 వరకు )**

**నక్షత్రం : ధనిష్ట ( తె 5.52 వరకు )**

**బ్రహ్మముహూర్తం : తె 5.16 నుండి తె 6.01 వరకు**

**రాహుకాలం : ఉ 11.08 నుండి మ 12.33 వరకు**

**యమగండం : మ 3.24 నుండి సా 4.49 వరకు**

**వర్జ్య కాలం : మ 12.37 నుండి మ 2.17 వరకు**

## ఈరోజు నమాజ్ వేళలు

**తేదీ : 04 జూన్ 2025**

**ఫజర్ : 5.35 ఉదయం**

**సూర్యోదయం : 6.48 ఉదయం**

**జొహర్ : 12.34 మధ్యాహ్నం**

**అసర్ : 3.52 సాయంత్రం**

**మగ్రిబ్ : 6.19 సాయంత్రం**

**ఇష : 7.32 సాయంత్రం**


జన స్వరం
విలేకరులు కావలెను
"జనస్వరం" ఈ-దినపత్రిక (వెబ్ పత్రిక) నందు పని చేయుటకు
రెండు తెలుగు రాష్ట్రాల్లో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి విలేకరులు కావలెను..
అసక్తి ఉన్న వారు సంప్రదించండి..
సాయి కల్యాణ్
ఫోన్ నెం : 7013030690
మేనేజింగ్ డైరెక్టర్
జనస్వరం మీడియా





# ఏకైక ధ్యేయం – అభివృద్ధి, ఆత్మగౌరవం

## ఎడిటోరియల్

నేటితో తెలుగుదేశం పార్టీ, జనసేన, భారతీయ జనతా పార్టీ కూటమి ప్రభుత్వానికి ఏడాది పూర్తవుతోంది. 2024 జూన్ 4వ తేదీన జరిగిన ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పు ద్వారా, అప్పటి వైఎస్సార్సీపీ అధికారానికి ముగింపు పలికింది. ప్రజల ఆశయాలను నెరవేర్చేందుకు, ఆత్మగౌరవం పునరుద్ధరించేందుకు, ఆర్థికంగా క్షీణించిన రాష్ట్రాన్ని తిరిగి బాటపెట్టేందుకు కూటమి ప్రభుత్వం ప్రవేశించిన దశ నుంచి ఇప్పటి దాకా ఎన్నో మార్పులు చోటుచేసుకున్నాయి. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ప్రభుత్వ కార్యక్రమాలుగా మార్చడంలో కూటమి ప్రభుత్వం ఫాస్ట్‌ట్రాక్ మోడ్‌లో అడుగులు వేసింది. మొదటి రోజే వ్యవసాయ రుణమాఫీపై ప్రకటన, అమరావతిని రాజధానిగా ప్రకటించటం, జనం కోరినవన్నీ అమలు దిశగా స్పష్టత చూపింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రభుత్వం ఓ దీర్ఘకాలిక దృక్పథంతో ముందుకెళ్లుతోంది. పాలనలో పారదర్శకత, ప్రజలతో ప్రత్యక్ష సంబంధం, అక్రమాలను ఉపేక్షించని వైఖరి ప్రభుత్వానికి గుర్తింపు తీసుకువచ్చింది. అమరావతిని రాజధానిగా కొనసాగిస్తూ నిర్మాణాలను తిరిగి ప్రారంభించడమే కాకుండా, సచివాలయం, హైకోర్టు, శాసన సభ భవన నిర్మాణాలకు తిరిగి ప్రణాళికలు సిద్ధమయ్యాయి. ముళ్లపాదయాత్రలు చేసిన రైతుల ఆకాంక్షలకు న్యాయం జరిగింది. నిర్మాణాల కోసం నిధుల సమీకరణ, అంతర్జాతీయ రంగాల ఆకర్షణలో చంద్రబాబు నైపుణ్యం స్పష్టంగా కనిపిస్తోంది. పూర్వ ప్రభుత్వం పాలనలో జరిగిన అక్రమాలకు వ్యతిరేకంగా విచారణలు వేగంగా సాగుతున్నాయి. మద్యం మాఫియా, బోగస్ రేషన్, టీటీడీ ఆస్తుల దుర్వినియోగం, భూ అక్రమాలపై చర్యలు ప్రారంభమయ్యాయి. ఆర్థిక బాధ్యతా నిబంధనల ప్రకారం వ్యయాలు నిర్వహిస్తూ ప్రభుత్వ ఖజానా దిశగా ఆలోచన జరగడం గమనార్హం. ఉద్యోగ నియామకాల్లో పారదర్శకత, ప్రకటనల సమయపాలన, పైన విధమైన జూనియర్ సివిల్ జడ్జిల నియామకం, DSC ప్రకటన, పోలీస్ నియామకాలు మొదలైనవి అభినందనీయమైనవి. అన్ ఎంప్లాయ్‌మెంట్



డాటా ఆధారంగా ఉద్యోగావకాశాల కల్పనకు ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ప్రతిపక్ష వైఎస్సార్సీపీ పోరాటాలు ప్రజల్లో పెద్దగా స్పందన తెచ్చుకోలేకపోయాయి. ముఖ్యంగా కేంద్రం – రాష్ట్రం పరస్పర సంబంధాల్లో కూటమి ప్రభుత్వానికి ఉన్న బలం వలన పలు అభివృద్ధి పథకాలకు ఆమోదం, సహకారం లభించింది. నిధుల కొరత, కేంద్ర సహాయం ఆలస్యం, పోలవరం ప్రాజెక్టు ఆడిట్, ఉద్యోగ నియామకాలు, ప్రత్యేక హోదా విషయంలో రాష్ట్రం ముందున్న సవాళ్లు గణనీయమైనవే. కానీ ప్రజల మద్దతుతో ఈ సవాళ్లను ఎదుర్కొనే నైపుణ్యం చంద్రబాబు నాయుడికి ఉన్నదని గతంలో రుజువైంది. ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంది. ఆత్మగౌరవాన్ని మళ్లీ నిలిపింది. భవిష్యత్తు పట్ల ఆశావహ దృష్టిని ప్రసాదించింది. పాలనలో నిర్ణయకర్తల ఆలోచనల స్పష్టత, బాధ్యతాయుత వ్యవహారశైలి, నూతన ఆవిష్కరణలకు అవకాశం ఇవ్వడం అన్ని కలిపి ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించాయి. ఇప్పుడు రాష్ట్ర ప్రజలు ఎదురుచూస్తున్నది – అభివృద్ధి కలల అమరావతి, పారదర్శక పాలన, ఆర్థిక పునరుజ్జీవనం. ఈ క్రమంలో వచ్చే రెండేళ్లు మరింత కీలకమైనవి కావాలని చెప్పవచ్చు.

# ఔషద గుణాల రేడు "అల్లనేరేడు"

**పులివెందుల జూన్ 3 (జనస్వరం) :** అల్లనేరేడు పండ్లను ఔషధ గుణాలరేడు (రాజు) అని పిలుస్తారు. ఇవి వేసవిలో లభిస్తాయి. సమయం సందర్భం రావడంతో ప్రస్తుతం మార్కెట్లో అల్ల నేరేడు పండ్లు దర్శనమిస్తున్నాయి. సీజన్ పరంగా లభించే పండ్లలో అల్ల నేరేడు ఒకటి. బీపీ షుగర్ థైరాయిడ్ వంటి వ్యాధిగ్రస్తులు ఈ అల్లం నేరేడు పండ్లను తినొచ్చు. నల్లగా గుండ్రంగా గోలీ ఆకారంలో ఉంటాయి. ఇది చూడగానే ప్రతి ఒక్కరికి నోరూరిస్తుంది. వంకల్లో వాగుల్లో బావి దిన్నెల వద్ద వీటి సంతతి కనిపిస్తుంది. ప్రస్తుతం సాగు ద్వారా కూడా అల్లనేరేడు పెంపకం చేపడుతున్నారు. ప్రస్తుతం వీటి ధర కిలో 200 రూపాయల చొప్పున క్రయ విక్రయాలు సాగుతున్నాయి. ఇప్పుడిప్పుడే ఇవి మార్కెట్లోకి రావడం వల్ల ధర కాస్త ఎక్కువగా ఉందని కొద్ది రోజులు పోతే మరింత తగ్గే అవకాశం ఉంటుందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. అల్లనేరేడు వల్ల ప్రయోజనాలను తెలుసుకుందాం. అల్లనేరేడు (జామున్) పండ్లు ఆరోగ్యానికి చాలా మేలు పెంచుతాయి, మధుమేహం, గుండె జబ్బులు, జీర్ణశయాశయ సంబంధిత సమస్యలు, క్యాన్సర్ వంటి వ్యాధుల నివారణలో సహాయపడతాయి. అల్లనేరేడు పండ్లలో యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు, ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. మధుమేహాన్ని నియంత్రిస్తాయి. అల్లనేరేడు పండ్లలో గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉంటుంది. ఇవి రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించడంలో సహాయపడతాయి. అల్లనేరేడు పండ్లలో పొటాషియం, మెంజిషియం, విటమిన్ సి ఉంటాయి. ఇవి గుండె జబ్బులను నివారించడంలో సహాయపడతాయి. అల్లనేరేడు పండ్లలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇది జీర్ణశయాశయ సమస్యలను తగ్గించడంలో సహాయపడుతుంది. అల్లనేరేడు పండ్లలో సైనైడిన్ వంటి సమ్మేళనాలు కొలన్ క్యాన్సర్ను నిరోధించే శక్తిని కలిగి ఉంటాయి. అల్లనేరేడు పండ్లలో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది కడుపు నిండినట్లు అనిపించి, బరువు తగ్గడానికి సహాయపడుతుంది. అల్లనేరేడు పండ్లలో యాంటీఆక్సిడెంట్లు కాలేయ పనితీరును మెరుగుపరుస్తాయి. అల్లనేరేడు పండ్లు చిగుళ్ల వ్యాధులను నివారిస్తాయి. వెన్నునొప్పి, నడుం నొప్పి, మోకాళ్ల నొప్పులను తగ్గిస్తాయి.



అల్లనేరేడు పండ్ల రసం జిగట విరేచనాలతో బాధపడే వారికి ఉపశమనం కలిగిస్తుంది. అల్లనేరేడు పండ్లను మీరు నేరుగా తినవచ్చు. అల్లనేరేడు పండ్ల రసం, జ్యూస్, లేదా జావగా కూడా ఉపయోగించవచ్చు. అల్లనేరేడు పండ్లు తిన్న తర్వాత కొన్ని గంటలపాటు అధికంగా నీరు త్రాగకూడదు. అల్లనేరేడు పండ్లను ఎక్కువగా తింటే జీర్ణశయాశయ సంబంధిత సమస్యలు వచ్చే అవకాశం ఉంది. అల్లనేరేడు పండ్లను మధుమేహ వ్యాధిగ్రస్తులు వైద్యుడి సలహా తీసుకుని మాత్రమే తినాలి. కావున అల్లనేరేడు పండ్లను అరగిద్దాం.. ఆరోగ్యాన్ని కాపాడుకుందాం.

# మలేరియా నివారణ మాసోత్సవాలు ప్రారంభం : పృథ్వీ కుమార్ రెడ్డి



**పులివెందుల, జూన్ 3 (జనస్వరం) :** నియోజకవర్గంలోని వేంపల్లి మండలం తాళ్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో మంగళవారం మలేరియా నివారణ మాసోత్సవాలు ప్రారంభమయ్యాయి. డాక్టర్ పృధ్వి ఆధ్వర్యంలో మలేరియా నియంత్రణపై జాగ్రత్తలు వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పృథ్వీ కుమార్ రెడ్డి మాట్లాడుతూ మలేరియా ప్లాస్మోడియం అనే పరాన్నజీవి ద్వారా ఇన్ఫెక్ట్ అయిన ఆడదోమ కుట్టడం ద్వారా వస్తుందన్నారు. ఈ దోమ మంచినీటి లోను నిలువ వుండే నీటి లోనూ పెరిగి మలేరియా వ్యాధిని వ్యాప్తి చేస్తుందన్నారు. ఈ దోమ రాత్రి పూట కుడుతుందన్నారు. వ్యాధి లక్షణాలు, మలేరియా నివారణ చర్యలు, నీరు నిల్వ ఉంచిన తోట్లు, కుళాయి వద్ద నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. శరీరాన్ని పూర్తిగా కప్పి వుంచే దుస్తులు ధరించాలని వారానికి ఒకసారి శుక్రవారం డ్రై డే నీటి తొట్లులు, ఇతర పాత్రలు, శుభ్రంగా కడిగి తుడిచి మరలా నీరు నింపుకోవాలన్నారు. దోమ తెరలు తప్పని సరిగా వాడాలని సాయంత్రం 5 నుండి 6 గంటల సమయంలో తలుపులు కిటికీలు మూసి వేయాలన్నారు. ఇంటిలోపల పనికి రాని చెత్తను ఉంచరాదు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమములో వైద్యులు నిహారిక, శాంతి సిహెచ్ ఓ వెంకట రత్నం హెల్త్ ఏడ్యుకేటర్ షఫీ ఉన్నీస ఎంపిహెచ్ఓ ఫక్రుద్దిన్ సూపర్వైజర్లు వెంకట లక్ష్మి అరుణ దేవి, అంకయ్య, ఆశాలు పాల్గొన్నారు.

# వెన్నుపోటు, గొడ్డలివేటు పేటెంట్.. జగన్ రెడ్డిదే

**- టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వెంకిటీల సురేంద్ర కుమార్**

**చిత్తూరు, జూన్ 3 (జనస్వరం) :** కన్నతల్లి, సొంత చెల్లితో పాటు చిన్నాన్న కుటుంబానికి వెన్నుపోటుతో గొడ్డలివేటు చేసిన పేటెంట్.. జగన్ రెడ్డిదే అని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి వెంకిటీల సురేంద్ర కుమార్ ఆరోపించారు. మంగళవారం ఆయన జిల్లా టీడీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. కుంభకోణాల నుంచి ప్రజా దృష్టి మళ్లించడానికే జగన్ ముఠా ధర్నాల డ్రామా ఆడుతున్నదని విమర్శించ్చారు. ఏ ప్రభుత్వం చేయని విధంగా తొలి ఏడాదిలోనే 70శాతం హామీలు అమలు చేసిన ఘనత తమ కూటమి ప్రభుత్వంకే దక్కిందన్నారు. గత ఐదేళ్ళలో 85 శాతం హామీలకు ఎగనామం పెట్టిన జగన్ సర్కార్.. బీసీ సామాజిక వర్గానికి చెందిన జింకా వెంకట నరసయ్య తన బెరైటీస్ మైన్లో జగన్ తాత రాజారెడ్డికి కొంత భాగస్వామ్యం కల్పిస్తే కృతజ్ఞత లేకుండా మైన్ ఓనర్ ని హత్య చేసి ఆ మైన్ ను రాజారెడ్డి కబ్జా చేసాడని ఆరోపించారు. బీసీలకు వెన్నుపోటుతోనే జగన్ కుటుంబం బెరైటీస్ గని యజమాని అయ్యారని తెలిపారు. కాంగ్రెస్ ను అడ్డం పెట్టుకుని రూ.లక్షల కోట్లు దోచుకుని, అదే పార్టీకి వెన్నుపోటు పొడిచి వైసీపీని స్థాపించిన జగన్ రెడ్డి వెన్నుపోటు గురించి మాట్లాడడం సిగ్గుగా ఉందన్నారు. చివరకు అక్రమ సంపాదనను కాపాడుకునేందుకే శివకుమార్ స్థాపించిన వైసీపీని కబ్జా చేసి శివకుమార్ కు సైతం వెన్నుపోటు పొడిచారని గుర్తు చేశారు. ఎత్తుకుని పెంచిన బాబాయ్ ని గొడ్డలి వేటుతో నరికి చంపిన కిరాతకులని కాపాడుతూ రక్తసంబంధానికి వెన్నుపోటు పొడిచిందెవరో



రాష్ట్ర ప్రజలకు బాగా తెలుసన్నారు. మద్యపాన నిషేధం పై మాట తప్పి విషపూరిత మద్యం పోసి పేదల ఆరోగ్యానికే వెన్నుపోటు పొడిచిన వ్యక్తి జగన్ అని మండిపడ్డారు. బీసీ, ఎస్సీ , ఎస్టీ, మైనారిటీ సబ్ ప్లాన్ నిధులు లక్ష కోట్లు దారి మళ్లించి సామాజిక న్యాయానికి వెన్నుపోటు పొడిచాడని జగన్ పై మండిపడ్డారు. 16,347 పోస్టులతో డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చి.. మొదటి సంతకం మాట నిలబెట్టుకున్న తమ అధినేతపై తప్పుడు మాటలు చెప్పడం జగన్ దిగజారుడు తనం అన్నారు. అధికారంలోకి రాగానే రోడ్లపై గుంతలు పూడ్చే కార్యక్రమం మొదలుపెట్టాం. ఇప్పటికే రూ.1200 కోట్లు ఖర్చు చేసి 20 వేల కి.మీ రోడ్లు బాగు చేసాం అని తెలిపారు. మళ్ళీ వర్షాలు వచ్చాయి. దెబ్బతిన్న రోడ్లను బాగుచేస్తాం. ఇది నిరంతర ప్రక్రియ. గత ప్రభుత్వంలా వదిలెయ్యం. వెన్నుపోటు అంటూ ధర్నాలు చేయటం దొంగే దొంగ అన్నట్లుగా ఉందని జగన్ ముఠాపై విమర్శలు గుప్పించారు.

# ప్రభుత్వ ఆసుపత్రి పరిరక్షణకు నిష్పాక్షిక నివేదిక ఇవ్వాలి

**చిత్తూరు, జూన్ 3 (జనస్వరం) :** జిల్లా కేంద్రంలోని చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రి వ్యవహారాల్లో అపోలో యాజమాన్యపు పాత్రపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన నిజ నిర్ధారణ కమిటీకి బాధితులు నిష్పాక్షిక నివేదిక ఇవ్వాలంటూ విజ్ఞప్తి చేశారు. తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యదర్శి దుర్గ మరణం సంఘటనపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విచారణ చేపట్టేందుకు ఈ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ నేపథ్యంలో మంగళవారం నిజ నిర్ధారణ కమిటీ సభ్యులు ఆసుపత్రిని సందర్శించగా, ప్రభుత్వ ఆసుపత్రి పోరాట కమిటీ ఆధ్వర్యంలో బాధితులు వారిని కలిశారు. ఈ సందర్భంగా వారు కమిటీ ముందు పలు విషయాలను సాక్ష్యాధారాలతో ఉంచారు. చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిని అపోలో యాజమాన్యం వ్యాపార కేంద్రంగా మార్చిందని, ఇది నిజమైన రోగుల అవసరాలకంటే వ్యాపార ప్రయోజనాలకే ఎక్కువగా సేవలందిస్తోందని ఆరోపించారు. అది ఒక రీసెర్చ్ సెంటర్, రిఫరల్ హాస్పిటల్‌గా రూపాంతరం చెందిందని, దీని కారణంగా స్థానిక పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారని వివరించారు. ముఖ్యంగా మూడు రోజుల క్రితం యానాది కులానికి చెందిన నాలుగు సంవత్సరాల పసిపాప మరణం, సోమవారం తలకు తీవ్ర గాయాలతో వచ్చిన పేద మహిళకు జరిగిన అమానవీయత వంటి సంఘటనల వివరాలను కమిటీకి వెల్లడించారు. ఆసుపత్రి పోరాట కమిటీ తరఫున మొత్తం 13 అంశాలపై అపోలో యాజమాన్యం చేస్తున్న నిర్వాకాన్ని



వెల్లడించగా, కమిటీ సభ్యులు దాదాపు 50 నిమిషాలపాటు సుదీర్ఘంగా విన్నారు. ఓ దశలో కమిటీ సభ్యులు అక్కడి వాస్తవ పరిస్థితుల్ని వింటూ భావోద్వేగానికి లోనయ్యారు. బాధితులు, పోరాట కమిటీ సభ్యులు కమిటీని కోరిన ముఖ్యమైన అంశం - చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిని అపోలో యాజమాన్యం నుంచి విముక్తి చేయాలన్నదే. ఈ ఆసుపత్రిపై చిత్తూరు పరిసరాల్లోని ఏడుగురు ఎమ్మెల్యే నియోజకవర్గాలకు చెందిన ప్రజల ఆరోగ్యం ఆధారపడిన పరిస్థితి. కానీ అపోలో తరఫున వారి కోసం న్యాయమైన సేవలేవీ అందడం లేదు. అంతేకాదు, అన్యాయమే జరుగుతోంది అని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి పోరాట కమిటీ కన్వీనర్ శోభ రాణి, కో కన్వీనర్ జయ కుమార్, గౌరవ డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, ఆర్.కె. సాధిక్, ఎన్. కుమరేష్, కరుణాకర్, అంజాద్ బాషా, ఆనంద్, రసూల్, గౌరీ తదితరులు పాల్గొన్నారు.

# శేరిలింగంపల్లి జర్నలిస్టుల ఇళ్ల స్థలం ఫెన్సింగ్ కూల్చివేసి కబ్జాకు యత్నం

**- స్థలం మధ్యలో నుంచి విద్యుత్ లైన్ స్తంభాల ఏర్పాటుకు యత్నం**

**- శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, చందానగర్ డిప్యూటీ కమిషనర్లకు ఫిర్యాదు**

**- ఫెన్సింగ్ కూల్చివేతపై క్రిమినల్ కేసు నమోదుకు డిప్యూటీ కమిషనర్ ఆదేశం**

**శేరిలింగంపల్లి, జూన్ 3 (జనస్వరం) :** శేరిలింగంపల్లి జర్నలిస్టుల ఇళ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం చందానగర్ లో కేటాయించిన భూమిలోకి అక్రమంగా ప్రవేశించిన కబ్జాదారులు స్థలం చుట్టూ రక్షణ కోసం ఏర్పాటు చేసిన ఫెన్సింగ్ ను తొలగించారు. స్థలం మధ్యలో నుంచి విద్యుత్ లైన్ ఏర్పాటు కోసం విద్యుత్ శాఖ అధికారులు స్తంభాల నిర్మాణ పనులు చేపట్టాగా, సమాచారం అందుకున్న శేరిలింగంపల్లి జర్నలిస్టులు పనులను అడ్డుకొని విషయాన్ని





మంగళవారం శేరిలింగంపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ దృష్టికి తీసుకువెళ్లారు. ఫెన్సింగ్ కూల్చివేతపై ఎమ్మెల్యే గాంధీ, చందానగర్ డిప్యూటీ కమిషనర్, చందానగర్ కార్పొరేటర్ ఫిర్యాదు చేశారు. శేరిలింగంపల్లి మండల పరిధిలో పనిచేస్తున్న జర్నలిస్టుల ఇళ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం చందానగర్ లోని సర్వే నెంబర్ 174 లో 1 ఎకరా స్థలాన్ని గతంలోనే కేటాయించిన విషయం తెలిసిందే. రెవెన్యూ అధికారులు హద్దులు నిర్ణయించి, పొజిషన్ హ్యాండ్ ఓవర్ చేసిన ఈ స్థలం చుట్టూ జర్నలిస్టులు ఖడీలు ఏర్పాటు చేసి రక్షణ కోసం ఫెన్సింగ్ వేశారు. సోమవారం కొంతమంది కబ్జాదారులు ఫెన్సింగ్ కూల్చివేసి జర్నలిస్టుల ఇళ్ల స్థలంలోకి అక్రమంగా ప్రవేశించారు. దీంతోపాటు ఈ స్థలానికి పక్కనే ఉన్న ప్రైవేట్ స్థలంలో ఉన్న విద్యుత్ లైన్ ను మార్చి, జర్నలిస్టుల ఇళ్ల స్థలం మధ్యలో నుంచి స్తంభాలను ఏర్పాటు చేసేందుకు విద్యుత్ శాఖ అధికారులు పనులు చేపట్టారు. విషయం తెలుసుకున్న జర్నలిస్టులు విద్యుత్ శాఖ అధికారుల పనులను అడ్డుకొని మంగళవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ దృష్టికి విషయాన్ని తీసుకువెళ్లారు. ఫెన్సింగ్ కూల్చివేతపై ఎమ్మెల్యే గాంధీకి ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులకు ఫోన్ చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ అధికారుల తీరుపై జర్నలిస్టులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పక్క స్థలంలో ఉన్న విద్యుత్ లైన్ ను మార్చి తమ స్థలంలో స్తంభాలు ఏర్పాటు చేయడం చట్టవిరుద్ధమని ఏడీఈని ప్రశ్నించారు. దీంతో తప్పు తెలుసుకున్న విద్యుత్ శాఖ అధికారులు నాటిన స్తంభాలను తొలగించడంతో పాటు పనులు చేపట్టిన కాంట్రాక్టర్ పై శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఫెన్సింగ్ కూల్చివేతపై శేరిలింగంపల్లి జర్నలిస్టులు చందానగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ను కలిసి ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన డిప్యూటీ కమిషనర్ ఫెన్సింగ్ కూల్చివేసిన వారిపై చట్ట ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేయాలని చందానగర్ పోలీసులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టు యూనియన్ల నాయకులు, శేరిలింగంపల్లి ప్రెస్ క్లబ్, టెంజు కార్యవర్గ సభ్యులు, శేరిలింగంపల్లి జర్నలిస్టులు పాల్గొన్నారు.



# రాజ్యసభ సభ్యులు పాకా సత్యనారాయణకు ఘన స్వాగతం

**దెందులూరు, జూన్ 3 (జనస్వరం) :** రాజ్యసభ సభ్యులు పాకా వెంకట సత్యనారాయణకు కలపర్రు వద్ద బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి తోపాటు జిల్లా బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఇటీవల ఢిల్లీలో ఎంపీగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మంగళవారం గన్నవరం విమానాశ్రయం నుండి ఏలూరు మీదుగా భీమవరం వెళ్తున్న పాకా సత్యనారాయణను కలపర్రు వద్ద గారపాటి చౌదరి, బీజేపీ నాయకులు శాలువాతో సత్కరించి పూలబొకే ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. కష్టపడి పనిచేసే కార్యకర్తలను గుర్తించే పార్టీ బీజేపీ అని, క్రమశిక్షణతో పార్టీలో సుదీర్ఘకాలం నుండి పనిచేసిన పాకాకు రాజ్యసభ పదవి దక్కిన భూపతిరాజు శ్రీనివాస వర్మకు ఎంపీగా కేంద్రమంత్రిగా అవకాశం దక్కిన అది బీజేపీలోనే సాధ్యమని గారపాటి చౌదరి అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు చౌటపల్లి విక్రమ్ కిషోర్, ఏలూరు పార్లమెంట్ కన్వీనర్ కట్నేని కృష్ణ ప్రసాద్, ఉంగుటూరు నియోజకవర్గం కన్వీనర్ శరణాల మాలతి రాణి, దెందులూరు నియోజకవర్గం కన్వీనర్ గుమ్మడి చైతన్య, బీసీ నాయకులు అశోక్ గౌడ్, అడపా శోభారాణి, నగరపాటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



# హరీష్ రావు జన్మదినం సందర్భంగా రక్తదాన శిబిరం

**- మహేష్ గౌడ్‌పై బీఆర్ఎస్ నేత నాగేశ్ ముదిరాజ్ తీవ్ర విమర్శలు**

**హైదరాబాద్, జూన్ 3 (జనస్వరం) :** మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు జన్మదినాన్ని పురస్కరించుకొని బీఆర్ఎస్ గ్రేటర్ సీనియర్ నాయకులు ఎం. నాగేశ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన నాగేశ్ ముదిరాజ్, ప్రజల కోసం నిరంతరం శ్రమించే నాయకుడు హరీష్ రావు ఆరోగ్యంగా ఉండాలనే సంకల్పంతో ఈ శిబిరం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అయితే, ఈ సందర్భంగా తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌పై ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు. "హరీష్ రావు వంటి ప్రజానాయకుడిని విమర్శించే నైతిక హక్కు మహేష్ గౌడ్‌కు లేదు. హరీష్ రావు ఏకంగా ఏడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. మీరు ఇప్పటివరకు ప్రజాప్రతినిధి కాలేదు. కాంగ్రెస్ టికెట్ ఇచ్చినా డిపాజిట్ కోల్పోయారు. లాటరీ పద్ధతిలో పీసీసీ అధ్యక్షుడయ్యారు," అని ఎం. నాగేశ్ మండిపడ్డారు. మరింతగా మాట్లాడుతూ, "తెలంగాణలోని 119 నియోజకవర్గాల్లో ఎక్కడైనా గెలిచే తాత్త్విక స్థాయి వచ్చిన తరువాతే మీరు మాట్లాడాలి. అప్పటివరకు విమర్శలు చేయడం అనవసరం. రాజకీయ అవగాహన లేకుండానే మీరు కాళేశ్వరం ప్రాజెక్టుపై విమర్శలు చేస్తున్నారు. ఒకవైపు ఎకరానికి ఎక్కువ కరెంట్ బిల్లు వస్తుందంటారు, మరోవైపు నీళ్లు రాలేవంటారు. ఇదేంటో అస్పష్టత. కాళేశ్వరం గొప్పతనం మీ కాంగ్రెస్ నాయకులే అనేకసార్లు ఒప్పుకున్నారు," అని గుర్తు చేశారు. ఇంకా మాట్లాడుతూ, "ఇరిగేషన్ కార్యాలయం రికార్డులు తెచ్చుకుని చూసుకోండి. కాళేశ్వరం ఎన్ని ఎకరాలకు నీటిని అందిస్తుంది. దేశ విదేశాల నుండి వచ్చిన ప్రతినిధులు ఈ ప్రాజెక్టును ప్రశంసించారు. ఇది తెలంగాణ రైతుల పాలిత జీవనాడి," అని చెప్పారు. మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు గాంధీభవన్ గుమ్మం మీద మహిళల సమస్యలపై ధర్నా చేసిన అంశాన్ని గుర్తు చేస్తూ, "మీ పార్టీలోని మహిళలకే న్యాయం



చేయలేరు. పైగా మహేష్ గౌడ్ మతిభ్రమించి మాట్లాడుతున్నట్టు కనిపిస్తోంది. తన రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికి అవాస్తవ వ్యాఖ్యలు చేస్తున్నారు," అని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. హరీష్ రావు జన్మదినాన్ని ప్రజాప్రయోజన కార్యక్రమాలతో జరపడం ఇది గొప్ప విషయమని పలువురు అభిప్రాయపడ్డారు.

# నిత్య యోగ సాధనతో సంపూర్ణ ఆరోగ్యం

**- మైపాడు బీచ్ లో యోగాంధ్ర గ్రాండ్ సక్సెస్**

**కోవూరు, జూన్ 3 (జనస్వరం) :** సంపూర్ణ ఆరోగ్యం సాధించాలంటే ప్రతి ఒక్కరూ యోగ సాధనను తమ జీవితంలో భాగం చేసుకోవాలని కోరారు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి. ఇందుకూరుపేట మండలంలోని మైపాడు బీచ్ వద్ద మంగళవారం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన "యోగాంధ్ర" కార్యక్రమం అత్యంత విజయవంతంగా కొనసాగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి, ఇంచార్జ్ కలెక్టర్ కార్తిక్ పాల్గొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు ప్రారంభించిన "ఆరోగ్య ఆంధ్రప్రదేశ్" దిశగా ప్రజలలో ఆరోగ్యవంతమైన జీవనశైలి పట్ల అవగాహన పెంచేందుకు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 2000 మందికి పైగా ప్రజలు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మైపాడు బీచ్ ఒడ్డున వేలాది మందితో సామూహిక యోగా నిర్వహించగా, ఆయుష్ శాఖ మరియు యోగ మిత్ర మండలికి చెందిన యోగా గురువులు యోగాసనాలను నేర్పారు. ఈ సందర్భంగా ఇంచార్జ్ కలెక్టర్ కార్తిక్ మాట్లాడుతూ, "శారీరక, మానసిక ఆరోగ్యానికి యోగా ఒక మార్గదర్శక సాధనం. ప్రతి ఒక్కరూ రోజువారీ జీవనశైలిలో యోగా భాగం చేసుకోవాలి," అన్నారు. గ్రామ, వార్డు స్థాయిలో ప్రారంభమయ్యే యోగా శిక్షణా శిబిరాల్లో ప్రజలు చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. అనంతరం మాట్లాడిన ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ, "సంపూర్ణ ఆరోగ్యానికి యోగా మాత్రమే సమాధానం. ఇంట్లోనే ఉండి యోగా సాధన చేస్తూ ఆరోగ్యం పరిరక్షించుకోవచ్చు. మొక్కుబడిగా కాకుండా నిత్య సాధనగా యోగా చేసేందుకు ప్రతిజ్ఞ చేయాలి," అన్నారు. జిల్లాలో ఇప్పటికే 8 లక్షల మందికి పైగా యోగాంధ్ర కార్యక్రమానికి రిజిస్టర్ కావడం ఆరోగ్యంపై ప్రజల్లో పెరుగుతున్న అవగాహనకు నిదర్శనమని పేర్కొన్నారు. చంద్రబాబు నాయుడు ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సంకల్పాన్ని సాధించేందుకు యోగాంధ్ర వంటి కార్యక్రమాలు గొప్ప సాధనంగా మారుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ అనూష, జిల్లా పర్యాటక శాఖ అధికారి ఉషశ్రీ, టిడిపి సీనియర్ నాయకులు దువ్వూరు



కళ్యాణ్ రెడ్డి, బుచ్చి మున్సిపల్ చైర్ పర్సన్ మోర్ల సుప్రజ, టిడిపి మండల అధ్యక్షులు ఏ. కొల్లు పవన్ కుమార్ రెడ్డి, బెజవాడ జగదీష్, గుత్తా శ్రీనివాసరావు, కోడూరు కమలాకర్ రెడ్డి, బెజవాడ వంశీ కృష్ణారెడ్డి, జనసేన నాయకులు గుడి హరి కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విద్యా వంతుడు హరికృష్ణని ఆదర్శంగా తీసుకోవాలి : కట్టా సత్యనారాయణ

**దెందులూరు, జూన్ 3 (జనస్వరం) :** ఉపాధ్యాయ నాయకులు విద్యావంతుడు, కీర్తిశేషులు గొరిపర్తి హరికృష్ణ వారి తృతీయ వర్ధంతి సభ దెందులూరు మండలం కొవ్వలి గ్రామంలో శ్రీ భక్తాంజనేయ ఆలయ ప్రాంగణంలో అమ్మ సోషల్ థాట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో న్యాయవాది కట్టా సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించబడినది. చిన్నతనం నుండి పట్టుదలతో అనేక ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొని, కష్టపడి చదువుకుని విద్యావంతుడై ఉపాధ్యాయ వృత్తిని చేపట్టి అనేకమంది విద్యార్థులకు మార్గదర్శకుడైన హరికృష్ణ మాస్టారు వారిని ఆదర్శంగా తీసుకోవాలని సభాధ్యక్షులు అమ్మ సోషల్ థాట్ ఫౌండేషన్ చైర్మన్ కట్టా సత్యనారాయణ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ సత్యనారాయణ రాజు మాట్లాడుతూ విజయవంతుడు గొరిపర్తి హరికృష్ణ ఆశయాలను ఆలోచనలు ముందుకు తీసుకెళ్లాలనే తపనతో ఇలాంటి సామాజిక సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్న తన అన్నయ్య గోరిపర్తి వెంకట రామకృష్ణ అభినందనీయుడు అని తెలియజేశారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న 'మానవత' విద్యానిధి చైర్మన్ ఆలపాటి నాగేశ్వర రావు మాట్లాడుతూ హరికృష్ణ గౌరవప్రదమైన ఉపాధ్యాయ వృత్తి చేపట్టి చదువు ఆవశ్యకత, విద్య విలువ తెలియజేయడం జరిగిందని కొనియాడారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న దెందులూరు మండలం విద్యాశాఖ అధికారులు ఎ.వి.





ఎన్. వరప్రసాద్ చేతుల మీదగా 2024-2025 సంవత్సరం ఎస్.ఎస్.సి పరీక్షలలో మొదటి ర్యాంకు, రెండవ ర్యాంకు, మూడో ర్యాంకు, నాలుగో ర్యాంకు, ఐదో ర్యాంకు సాధించిన చిరంజీవులు వేద జ్యోతిష్ లోహిత్ కుమార్, గొల్ల వేణుగోపాల్, గంటేరి ఏసు ప్రశాంతి, పెండెం ధర్మతేజ, చాట్ల సుధీర్, మొహమ్మద్ సమీర్ లకు ప్రతిభా పురస్కారం అవార్డులు, క్యాష్ ప్రైస్లు, నోట్ బుక్స్ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్య అతిథులు, విశిష్ట అతిథులు చేతుల మీదగా అందించడం జరిగింది. అలాగే ఈ కార్యక్రమానికి హాజరైన వక్తలు కొవ్వలి జిల్లా పరిషత్ హై స్కూల్ హెడ్మాస్టర్ యస్.ఎల్.ఎన్.వి. శర్మ, విశ్రాంతి ఎల్. ఎఫ్. ఎల్-హెచ్.ఎం శొంఠియాల కస్తూరిరావు, కడియాల కృష్ణారావు, పోలవరపు దేవరత్నాకర్ రావు, కడుపు కన్నయ్య, నాగాస్త్ర, చేతుల మీదుగా 30 మంది వృద్ధ మహిళలకు, మనుషలకు 18,000 రూపాయల విలువైన నూతన వస్త్రాలు పంపిణీ చేయడమైనది. దివంగత హరికృష్ణ మాస్టర్ అన్నగారు గొరిపర్తి వెంకట రామకృష్ణ తన ప్రియమైన తమ్ముని జ్ఞాపకార్థం ప్రతి సంవత్సరం 70,000 రూపాయలు పైగా వెచ్చించి ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం ఎంతో అభినందించ దగ్గ విషయం అని సభలో పాల్గొన్న వక్తలు కొనియాడారు. గ్రామస్తులు, విద్యార్థులు, యువజనులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యార్థులు బాగా చదివి అభివృద్ధిలోకి రావాలని విద్యావంతుడైన గొరిపర్తి హరికృష్ణ వారిని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని సభలో పాల్గొన్న వక్తలు తెలియజేశారు. కార్యక్రమం అనంతరం అల్పాహారం అందించారు.

# గ్రంథాలయాలతో విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

**- పెదపాడు గ్రంథాలయంలో 31వ రోజు వేసవి శిబిరం**

**పెదపాడు, జూన్ 3 (జనస్వరం) :** విద్యార్థులు గ్రంథాలయాల ద్వారా విజ్ఞానం పెంపొందించుకోవాలని విద్యావేత్తలు పిలుపునిచ్చారు. పెదపాడు శాఖా గ్రంథాలయంలో ఉచిత వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మంగళవారం 31వ రోజు కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. స్థానిక శ్రీకృష్ణ గురుకులం ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఉపాధ్యాయులు శేటికం వెంకటేశ్వరరావు 'రోదసి యాత్రలు' అనే అంశంపై విద్యార్థులకు విశేష సమాచారం అందించారు. వారు మాట్లాడుతూ, మనకు కన్పించే నీలాకాశం, నక్షత్రాలు, చంద్రుడు, సూర్యుడు ఇవన్నీ మన ఊహలకు అందని అనంత విశ్వంలో భాగమని వివరించారు. అంతరిక్షం అంటే ఏమిటి? ఎలా రోదసి యాత్రలు ప్రారంభమయ్యాయి? మొదటి ఉపగ్రహం స్పుత్నిక్, అపోలో-11 ద్వారా తొలి చంద్రయాత్ర వంటి విశ్వ విజ్ఞాన విషయాలను స్పష్టంగా తెలియజేశారు. రాకెట్ల ద్వారా వ్యోమగాములు రోదసి ప్రయాణాలు



ఎలా చేస్తారనే అంశాన్ని విద్యార్థులకు ఆసక్తికరంగా వివరించారు. తర్వాత "తెలివైనవాడు" పుస్తకం నుండి "దిద్దుకున్న పొరపాటు" అనే నీతికథను విద్యార్థులతో చదివించడం, కథ చెప్పించడం, పుస్తక సమీక్ష చేయించడం నిర్వహించారు. అదే సమయంలో "స్వర్ణ ఆంధ్ర – 2047" అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీ నిర్వహించారు. ఈ రోజు శిబిరంలో మొత్తం 21 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమం గ్రంథాలయ అధికారి దుగ్గుపోగు జాన్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించబడింది. విద్యార్థులకు స్నాక్స్ పంపిణీ చేశారు.

# పరమ పవిత్ర త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

**దెందులూరు, జూన్ 3 (జనస్వరం) :** మండలంలోని పోతునూరు గ్రామంలో త్రైత సిద్ధాంత -ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక నూజివీడు కమిటీ సభ్యుల వారి ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం జరిగింది. భగవద్గీతలోని పురుషోత్తమ ప్రాప్తి యోగం అధ్యాయం నందు 16 వ శ్లోకంలో క్షర పురుషుడు అని జీవాత్మ గురించి, అక్షర పురుషుడు అని ఆత్మ గురించి, 17వ శ్లోకంలో పురుషోత్తముడు అని పరమాత్మ గురించి చెప్పారు. అంటే జీవాత్మ, ఆత్మ, పరమాత్మ, అనే మూడు ఆత్మలు



ఆధ్యాత్మికంలో ముఖ్యమైనవి అని అర్థం. దీని ఆధారంగా నే త్రైత సిద్ధాంత భగవద్గీత ను గురువు అయిన శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల స్వామి వారు వ్రాశారు. ఒక సిద్ధాంతాన్ని ప్రతిపాదన చేసి శాస్త్ర బద్ధత తో కూడిన జ్ఞానం ను అందించారు. మధ్యాత్మ ఆరాధన తో ధర్మముల స్థాపన జరుగుతుంది., అదే త్రైత సిద్ధాంతం యొక్క ముఖ్య ఉద్దేశం అని తెలిపారు. కార్యక్రమం లో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక నూజివీడు కమిటీ అద్యక్షులు, సభ్యుల అరుణ్ కుమార్, కోటేశ్వరరావు, అశోక్, శ్రీకాంత్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# చిలకలూరిపేటలో ప్రభుత్వ చిన్నపిల్లల ఆసుపత్రికి శాసనసభ్యుల మద్దతు

**చిలకలూరిపేట, జూన్ 3 (జనస్వరం) :** పట్టణంలోని పాత ప్రభుత్వ హాస్పిటల్ స్థలంలో ప్రభుత్వ చిన్నపిల్లల హాస్పిటల్ నిర్మించాలన్న డిమాండ్‌కి అఖిలపక్ష సహకార సాధన కమిటీ మద్దతు పెరుగుతోంది. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం కమిటీ ప్రతినిధులు మాజీ మంత్రి, చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావును వారి క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. కమిటీ గౌరవ అధ్యక్షులు, టీడీపీ సీనియర్ నాయకులు షేక్ జమాల్ బాషా, కమిటీ అధ్యక్షులు చేవూరి కృష్ణమూర్తి, కార్యదర్శి నాయుడు శివకుమార్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రభుత్వ చిన్నపిల్లల ఆసుపత్రి ఏర్పాటుతో స్థానికంగా వైద్య సేవలు మరింత మెరుగవుతాయని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు సానుకూలంగా స్పందిస్తూ, చిన్నపిల్లల హాస్పిటల్ నిర్మాణానికి తగిన నిధులు, అనుమతులు తీసుకొచ్చేందుకు ప్రభుత్వ స్థాయిలో కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వినతిపత్రం అందజేసిన ఇతర నాయకుల్లో పేలూరి రామారావు, నాగభైరు రామసుబ్బాయమ్మ, మాదాసు భాను ప్రసాద్, రిటైర్డ్ ఎక్సైజ్ సీఐ గోరంట్ల నారాయణ యాదవ్, కొప్పురావూరి నాగేశ్వరరావు, సీనియర్ జర్నలిస్టు దారా బుచ్చిబాబు, ఏ. వీరాంజనేయులు, బొంతా భగత్ సింగ్ తదితరులు ఉన్నారు. చిన్నపిల్లల ఆసుపత్రి కోసం కొనసాగుతున్న ఈ ఉద్యమానికి ప్రజా మద్దతు బలంగా ఉండటంతో అధికారులు, ప్రజాప్రతినిధులు త్వరితగతిన స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.



## తెలంగాణ

# మాల జాతికి సహాయ సహకారాలు అందజేస్తున్న ఉమ్మే గంగాధర్



**భైంసా, జూన్ 3 (జనస్వరం) :** మండలం కామోల్ గ్రామానికి చెందిన విశ్రాంతి ఉద్యోగి ఉమ్మే గంగాధర్ గత కొన్ని సంవత్సరాలుగా మాల జాతి అభివృద్ధికి తన వంతు సేవలందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. సామాజిక సేవ పట్ల ఉన్న నిబద్ధతతో వివిధ కార్యక్రమాలకు ఆర్థికంగా సహకరిస్తూ గ్రామీణ స్థాయిలో చైతన్యం నింపుతున్నారు. కమోల్ గ్రామంలో నిర్మాణానికి సిద్ధమవుతున్న అంబేద్కర్ భవనానికి ఉచితంగా స్థలం కేటాయించడమే కాకుండా, లార్డ్ బుద్ధ ఛానెల్‌కు ఆర్థిక సాయం అందించామని గంగాధర్ తెలిపారు. అలాగే కన్కాపూర్ గ్రామంలో జరిగిన మహిళా శిబిరంలో పాల్గొన్న మహిళలకు చీరలు పంపిణీ చేశారు. భైంసాలో నిర్వహించిన ప్రకాష్ అంబేద్కర్ కార్యక్రమానికి సహకరించినట్లు పేర్కొన్నారు. భైంసా బుద్ధ విహార్ కమిటీకి, అంబేద్కర్ విగ్రహానికి రంగులు వేయడానికీ, సమతా సైనిక్‌గా పనిచేస్తున్న ఐదుగురు కార్యకర్తలకు యూనిఫామ్లను అందించారని వివరించారు. లింగా గ్రామంలో జరిగిన అన్నబావు సాటే జయంతి కార్యక్రమానికి, శాస్త్రీనగర్ బుద్ధ విహార్ అభివృద్ధికి తన వంతు సహకారం అందించారని తెలిపారు. ప్రస్తుతం పట్టణంలోని భారతీయ బౌద్ధ మహాసభ కోశాధికారిగా సేవలందిస్తున్న ఉమ్మే గంగాధర్, మాల జాతి ప్రగతికి నిమగ్నమై ఉన్నారని, ఇతరులకూ ఆదర్శంగా నిలుస్తున్నారని స్థానికులు ప్రశంసిస్తున్నారు.

# పులివెందులలో చర్మవ్యాధులపై నిపుణుల సేవలు

**- ఫాతిమ మెడికల్స్ లో ప్రత్యేక వైద్య శిబిరం**

**పులివెందుల, జూన్ 3 (జనస్వరం) :** చర్మ వ్యాధులతో పాటు గోర్లు, వెంట్రుకలు, కాస్మెటిక్ సమస్యలతో బాధపడుతున్న పులివెందుల మరియు పరిసర ప్రాంత ప్రజలకు శుభవార్త. పులివెందుల పట్టణంలోని ప్రసిద్ధ ఔషధ కేంద్రమైన ఫాతిమ మెడికల్స్ లో ఈ నెల 8వ తేదీ ఆదివారం మధ్యాహ్నం 3.00 గంటల నుండి సాయంత్రం 6.00 గంటల వరకు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. ఈ శిబిరంలో ప్రముఖ చర్మ వ్యాధి నిపుణులు డాక్టర్ దీపక్ టోనీ రాజ్ ప్రజలకు నేరుగా సేవలందించనున్నారు. ప్రజలు తమ చర్మ సమస్యలు, గోర్ల, వెంట్రుకల సమస్యలు, సోరియాసిస్, కాస్మటాలజీ సంబంధిత సమస్యలపై వైద్యుడిని సంప్రదించవచ్చని ఫాతిమ మెడికల్స్ యాజమాన్యం తెలిపింది.ప్రజల సౌకర్యార్థం ముందస్తుగా అపాయింట్మెంట్ తీసుకునేలా 7997744100 నెంబర్ కు కాల్ చేయాలన్నారు. పాత ఆర్టీసీ బస్టాండ్ రోడ్డులోని ఫాతిమ మెడికల్స్ లో నిర్వహించనున్న ఈ శిబిరాన్ని ప్రజలు విస్తృతంగా వినియోగించుకోవాలని సూచించారు.

# గణపవరం అయ్యప్ప ఆలయంలో శంకు ప్రతిష్ఠ మహోత్సవానికి ఏర్పాట్లు

**చిలకలూరిపేట, జూన్ 3 (జనస్వరం) :** నాదెండ్ల మండలం గణపవరం గ్రామంలో ఈ నెల 5వ తేదీన శ్రీ అయ్యప్ప స్వామి వారి దేవాలయ ప్రాంగణంలో శంకు ప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా జరగనుంది. ఈ మహోత్సవానికి సంబంధించిన ఏర్పాట్లు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జోరుగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా గణపవరం అయ్యప్ప సేవా సంఘం, భక్తులు, శంకు ప్రతిష్ఠ మహోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరుకావలసిందిగా ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సభ్యులు మర్రి రాజశేఖర్ ను ఆహ్వానించారు. మహోత్సవాన్ని శ్రద్ధాభక్తులతో నిర్వహించేలా సిద్ధమవుతున్నారు. ఈ ఆహ్వాన కార్యక్రమంలో ఆలయ దేవస్థాన అధ్యక్షులు మండలనేని వెంకటేశ్వర్లు, గురుస్వామి తులం పూర్ణచంద్రరావు, మాదినేని చంద్రమౌళి, కెల్లంపల్లి రెడ్డయ్య మాస్టర్, సిద్దు హనుమంతరావు, అధికారి వెంకటేష్, చక్రవరం శివరాజు తదితరులు పాల్గొన్నారు. అయ్యప్ప భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై పూజా కార్యక్రమాల్లో పాల్గొనాలని నిర్వాహకులు కోరుతున్నారు. ఈ శంకుస్థాపన మహోత్సవం అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం కూడా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది.



# పాయకరావుపేటలో "వెన్నుపోటు దినం" పోస్టర్ ఆవిష్కరణ

**పాయకరావుపేట, జూన్ 3 (జనస్వరం) :** వైసీపీ ఆధ్వర్యంలో మంగళవారం పాయకరావుపేట వై జంక్షన్ వద్ద "వెన్నుపోటు దినం" పోస్టర్‌ను జిల్లా వ్యవసాయ సలహా మండలి మాజీ చైర్మన్, పాయకరావుపేట వైసీపీ మండల అధ్యక్షుడు చిక్కాల రామరావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు లంక సూర్యనారాయణ, ఎంపీపీ ఈసరపు పార్వతి తాతారావు, సీనియర్ నాయకులు ధనిశెట్టి బాబురావు, జిల్లా అధికార ప్రతినిధి దగ్గుపల్లి సాయిబాబా, ఉప సర్పంచ్ జగతా భవాని శ్రీను, వైసీపీ టౌన్ ప్రెసిడెంట్ ధనిశెట్టి మహేష్, కొనే పుత్రయ్య, సర్పంచ్ చేపల నాగమణి తాతాజీ, జొన్నకుటి సూరిబాబు, పిరది రాజు తదితరులు పాల్గొన్నారు.



# గొలుసు దొంగల అరెస్ట్

**పులివెందుల, జూన్ 3 (జనస్వరం) :** కడప జిల్లా ప్రొద్దుటూరులోని బొల్లవరం శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం సమీపంలో దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు గొలుసు దొంగలను మంగళవారం అరెస్టు చేసినట్లు 3 టౌన్ ఎస్ఐ గోవింద్ రెడ్డి వెల్లడించారు. ఒంటరి మహిళలే లక్ష్యంగా చేసుకొని వీరు చోరీలకు పాల్పడుతున్నారని ఆయన తెలిపారు. నిందితులైన మైదుకూరు సాయినాథ్ పురం వాసులు మర్రి జాషువా, మర్రి జయ ప్రకాశ్ వద్ద నుంచి 45 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు.



# బయటపడిన వినాయకుని విగ్రహం



**పులివెందుల జూన్ 3 (జనస్వరం) :** కడప జిల్లా పెండ్లిమర్రి మండలం కొత్త గిరియపల్లె గ్రామ పంట పొలాలల్లో మంగళవారం వినాయకుని విగ్రహం బయటపడింది. గ్రామ శివారులో బేతాళ ఆంజనేయ స్వామి గుడి దగ్గర నడిపి సుబ్బారెడ్డి తన పొలంలో ట్రాక్టర్తో సేద్యం చేస్తుండగా పెద్ద రాయి తగిలింది. దాన్ని వెలికితీసి చూడగా అది వినాయకుని విగ్రహమని గ్రహించి తమ గ్రామస్థులకు తెలిపారు. అనంతరం పొలం యజమాని కుటుంబ సభ్యులు వినాయక విగ్రహానికి పూజలు నిర్వహించారు. విషయం తెలుసుకున్న చుట్టుపక్కల గ్రామస్థులు విగ్రహాన్ని చూడటానికి పెద్ద ఎత్తున ప్రజలు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# "తుడ" చైర్మన్ కు క్రెడాయ్ ప్రతినిధుల సన్మానం

**తిరుపతి, జూన్ 3 (జనస్వరం) :** తిరుపతి అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ (తుడ) చైర్మన్ గా ఇటీవల నియామకమైన "డాలర్స్" దివాకర్ రెడ్డిని మంగళవారం తుడా కార్యాలయంలో "క్రెడాయ్" ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్చాలు అందజేసి శాలువాలు కప్పి ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు. తమ క్రెడాయ్ సభ్యులైన డాలర్స్ దివాకర్ రెడ్డి తుడా చైర్మన్ గా నియమితులవడం తమకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. దివాకర్ రెడ్డి ఆధ్వర్యంలో తిరుపతి నగరం నెక్స్ట్ లెవెల్ కి వెళుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తిరుపతి నగర అభివృద్ధిలో తుడా తో కలిసి క్రెడాయ్ కూడా పనిచేస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో క్రెడాయ్ తిరుపతి చాప్టర్ చైర్మన్ గోపీనాథ్, అధ్యక్షులు రాంప్రసాదరావు, ఉపాధ్యక్షులు రాజేష్, కార్యదర్శి నరసింహారెడ్డి, ట్రెజరర్ హరికృష్ణ, సభ్యులు స్వరూప్, ప్రభాకర్, నీలేష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



# పాక వెంకట సత్యనారాయణకు శుభాకాంక్షలు

**- రాష్ట్ర గౌడ సంఘం ఎగ్జిక్యూటివ్ చైర్మన్ చలమోలు అశోక్ గౌడ్**



**దెందులూరు, జూన్ 3 (జనస్వరం) :** గౌడ్ సంఘం నాయకులు, భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకుడు ఇటీవల రాజ్యసభ సభ్యునిగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా గౌడ బిడ్డ పాక వెంకట సత్యనారాయణకు శుభాకాంక్షలు తెలుపుతున్నానని రాష్ట్ర గౌడ సంఘం ఎగ్జిక్యూటివ్ చైర్మన్ చలమోలు అశోక్ గౌడ్ అన్నారు. ఆయన ఏలూరు జిల్లా విచ్చేస్తున్న సందర్భంగా, ఏలూరు జిల్లాలో గౌడ సంఘీయుల ఆధ్వర్యంలో, హనుమాన్ జంక్షన్ వద్ద స్వాగతం పలికి అక్కడి నుండి ర్యాలీగా భీమవరం వరకు వెళ్లారు. రాజ్యసభ సభ్యుడిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా పాక వెంకట సత్యనారాయణ కు పూల బొకే ను చలమోలు అశోక్ గౌడ్ అందించారు. ఎగ్జిక్యూటివ్ చైర్మన్ కు రాష్ట్ర గౌడ సంఘం తరపున శుభాకాంక్షలు తెలిపారు.

# పెద్దపల్లి శ్రీశ్రీశ్రీ వేమాలమ్మ అమ్మవారిని దర్శించుకున్న చలపతి రావు

అనకాపల్లి, జూన్ 3 (జనస్వరం) : మంగళవారం యలమంచిలి మున్సిపాలిటీ పెద్దపల్లి 20వ వార్డు గ్రామంలో శ్రీశ్రీశ్రీ వేమాలమ్మ పండగ సందర్భంగా మాజీ పార్లమెంటు సభ్యులు పప్పల చలపతి రావు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షులు గొర్లె నానాజీ, జనసేన పట్టణ పార్టీ అధ్యక్షులు బోద్ధపు శ్రీనివాసరావు, క్లస్టర్ ఇంచార్జ్ బోద్ధపు నాగేశ్వరరావు, జెర్రిపోతుల అప్పారావు, నమ్మి రమణ, కరణం రవి, దంట్ల వెంకటస్వామి, ఓమ్మి తాతాజీ, బి అశోక్, కూటమి నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



# హనుమాన్ జంక్షన్ లో అభయాంజనేయ స్వామిని దర్శించుకున్న రాజ్యసభ సభ్యుడు పాక వెంకట సత్యనారాయణ

**దెందులూరు, జూన్ 3 (జనస్వరం) :** బీజేపీ సీనియర్ నేత, ఇటీవలే రాజ్యసభ సభ్యులుగా ఎంపికైన పాక వెంకట సత్యనారాయణ మంగళవారం దెందులూరు నియోజకవర్గంలోని పెదపాడు మండలం అప్పనవీడు సమీపంలోని ప్రసిద్ధ హనుమాన్ జంక్షన్ శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన పాక వెంకట సత్యనారాయణకు దేవస్థానం చైర్మన్ వేమూరి శ్రీనివాసరావు, ఈవో పితాని తారకేశ్వరరావు ఆలయ సంప్రదాయాల మేరకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించగా, రాజ్యసభ సభ్యుడికి స్వామివారి ప్రతిమా చిత్రం బహుమతిగా అందజేశారు. ఈ సందర్భంగా పాక వెంకట సత్యనారాయణ మాట్లాడుతూ, "రాజ్యసభ సభ్యుడిగా తన ఎన్నికపై దేవుని ఆశీస్సులుగా భావిస్తున్నానని, ప్రజాసేవలో మరింత నిబద్ధతతో ముందుకు సాగతానని" తెలిపారు. ఈ దర్శన కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు చౌటుపల్లి విక్రమ్ కిషోర్, దెందులూరు నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ గుమ్మడి వెంకట చైతన్య కృష్ణ, సీనియర్ నాయకులు మందూరి బుజ్జి గోపాల్ తదితర నాయకులు పాల్గొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి సేవలో భాగస్వాములయ్యారు.



# యోగాంధ్రలో బ్యాంకర్స్, లీడ్ బ్యాంకు ఉద్యోగులు, సిబ్బంది

**- ప్రతిరోజు యోగా ఆసనాలు చేసుకోవడం వలన మానసిక ప్రశాంతతో పాటు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చు**
**- ఏలూరు జిల్లా లీడ్ బ్యాంకు మేనేజరు డి.నీలాద్రి**

**ఏలూరు, జూన్ 3 (జనస్వరం) :** యోగాంధ్రలో ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు రీజనల్ మేనేజరు శ్రీదేవి, బ్యాంకర్స్, లీడ్ బ్యాంకు ఉద్యోగులు, సిబ్బంది సుమారు 90 మంది పాల్గొన్నారని లీడ్ బ్యాంకు మేనేజరు డి.నీలాద్రి తెలిపారు. యోగాంధ్ర మాస వేడుకల కార్యక్రమాలలో భాగంగా మంగళ వారం స్థానిక వట్లూరు టిటిడిసిలో నిర్వహించిన యోగాభ్యాసన కార్యక్రమంలో పాల్గొని యోగా అభ్యాసనాలు చేశారు. ఈ సందర్భంగా లీడ్ బ్యాంకు మేనేజరు డి.నీలాద్రి మాట్లాడుతూ ప్రస్తుత జీవితంలో ఉరుకుల పరుగుల వలన వ్యాయామం చేయడమే మర్చిపోవడం జరుగుతోందన్నారు. ప్రతిరోజు కొంత సమయం కేటాయించి యోగా ఆసనాలు చేసుకుని ఇతరులకు ఆదర్శంగా నిలవాలన్నారు. యోగా ఆసనాలు, ఎక్సర్సైజులు చేసుకోక పోవడం వలన అనేక వ్యాధులకు గురికావాల్సి వస్తోందని, ప్రతి ఒక్కరూ ఆలోచన చేయాలన్నారు. యోగా సాధన ద్వారా అపారమైన ప్రయోజనాలు కలుగుతాయని యోగ శారీరక, మానసిక, ఆధ్యాత్మిక శ్రేయస్సును సమతుల్యం చేయడానికి దోహద పడుతుందన్నారు. ఇది కేవలం వ్యాయామం మాత్రమే కాదని శారీరక దృఢత్వం, ప్రశాంతత, మనశ్శాంతిని అందించడానికి సహాయ పడుతుందన్నారు. ప్రతిరోజు యోగా చేయడం నిత్యకృత్యంగా మార్చుకోవాలని తద్వారా అనేక వ్యాధులను దూరం చేసుకునేందుకు వీలుంటుందని తెలిపారు.



ఈ కార్యక్రమంలో బ్యాంకు అధికారులు,లీడ్ బ్యాంకు, బ్యాంకు ఉద్యోగులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# నిబద్ధతగల నేత రాజ్యసభ ఎంపీ పాకా సత్యనారాయణ

**- కేంద్ర మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ**

**మండవల్లి జూన్ 3 (జనస్వరం) :** ఇటీవల రాజ్యసభ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేసిన పాకా సత్యనారాయణ నిబద్ధత గల నేత అని, కష్టపడిన ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు భారతీయ జనతా పార్టీలో లభిస్తుందని దానికి నిదర్శనం పాకా సత్యనారాయణ అని కేంద్ర ఉక్కు మరియు భారీ పరిశ్రమల శాఖ మాత్యులు భూపతి రాజు శ్రీనివాస్ వర్మ, ప్రభుత్వ అస్యూరెన్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ లు ప్రశంసించారు. మంగళవారం మండవల్లి మండలం లోకుమూడి దత్త ఆశ్రమం నందు కైకలూరు నియోజకవర్గ గౌడ సంక్షేమ సంఘం అధ్యక్షులు పోలగాని నాగరాజు ఆధ్వర్యంలో రాజ్యసభ సభ్యులు పాకా సత్యనారాయణకు గజమాల వేసి సన్మానం చేశారు. ఈ కార్యక్రమానికి కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ మాత్యులు భూపతి రాజు శ్రీనివాస్ వర్మ, ప్రభుత్వ అస్యూరెన్స్ కమిటీ చైర్మన్ , ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్రథమంగా ఏలూరు రోడ్డులోని సిఎన్ఆర్ గార్డెన్స్ నందు రాజ్య సభ సభ్యులు కాన్వాయ్ కు స్వాగతం పలికారు. ఈ సభకు రాష్ట్ర గౌడ్ సంఘ నాయకులు పరసా ఏడుకొండలు సభాధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా కేంద్ర మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీలో కష్టపడిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు లభిస్తుందని, దాన్లో భాగంగానే పాక సత్యనారాయణకు రాజ్యసభ ఎంపీ కేటాయించి బీసీలకు పెద్దపీట వేసిందన్నారు. దేశ ప్రయోజనాలే బిజెపి లక్ష్యమన్నారు. అదేవిధంగా తనకు, రాజ్యసభ సభ్యులు సత్యనారాయణ పార్టీలో చేసిన సేవా కార్యక్రమాల వివరాలను వెల్లడించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విట్టల్ రావు, గౌడ సంఘ నాయకులు పరసా వీర్రాజు, మేకా నాగేశ్వరరావు, పోసిన పాపారావు గౌడ్, వేంద్ర నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.



# తెలుగువారి చారిత్రక వైభవానికి, వారసత్వానికి ప్రతీక కొండవీడుకోట

**- మాజీ రాజ్యసభ సభ్యుడు, రాజకీయ విశ్లేషకుడు డాక్టర్ తులసిరెడ్డి**

**చిలకలూరిపేట, జూన్ 3 (జనస్వరం) :** యడ్లపాడు మండలంలోని చారిత్రక ప్రసిద్ధి గాంచిన కొండవీడుకోటను మాజీ రాజ్యసభ సభ్యుడు, రాజకీయ విశ్లేషకుడు డాక్టర్ తులసిరెడ్డి మంగళవారం సందర్శించారు. ముందుగా ఘాట్‌రోడ్డు, మహాద్వారం, పిల్లల క్రీడాపార్కు, తూర్పు ద్వారము (కట్టిలదిద్ది వాకిలి), లక్ష్మీనరసింహస్వామి ఆలయం, వేమన మండపం, అనవేమారెడ్డి విగ్రహం, చారిత్రక అంశాలను వివరించే గ్యాలరీ, ముత్యాలమ్మ, పుట్టాలమ్మ, వెదుళ్ల చెరువు డెక్కు ప్రాంతాలతో పాటు కొండపై ఉన్న చారిత్రక ప్రదేశాలను ఎంతో ఆసక్తిగా తిలకించారు. కత్తులబావి సందర్శనకు వెళ్లగా కోటగ్రామస్తులు సాదరస్వాగతం పలికారు. కొండవీటి కైఫియత్తు ఆధారంగా 72 మంది పాలెగాండ్ల తిరుగుబాటును అణచివేసేందుకు బావిలో కత్తులు అమర్చి జరిగిన ఘోర ఘటనను కల్లి శివారెడ్డి వివరించారు. అక్కడ నుంచి హౌస్‌గణేష్‌పాడులోని అఖిలభారత రెడ్లసంక్షేమ సమాఖ్య ఏర్పాటు చేసిన కొండవీటి రెడ్డిరాజుల వారసత్వ ప్రదర్శనశాలను సందర్శించారు. అక్కడ ఇటీవల లభ్యమైన పురాతన ఖడ్గాన్ని, రాతి ఫిరంగి గుండును తులసిరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండవీడుకోటను పుస్తకాల్లో తప్ప క్షేత్రస్థాయిలో చూడటం తొలిసారి అన్నారు. గ్రంథాల్లో రాసిన వాటికంటే వీటి ప్రాముఖ్యత ఎంతో గొప్పదనే అభిప్రాయం కలిగిందన్నారు. అద్దంకి నేల రాజధానిని కొండవీడు కొండలపై గిరిదుర్గంగా చేసుకుని వందేళ్లకు పైగా శతదుర్భేద్యంగా పాలించారని, కవిత్రయంలో ఎర్రప్రెగడ, కవిసార్వభౌముడు శ్రీనాథుడు, ప్రజాకవి వేమన, పెదకోమటి వేమారెడ్డి వంటి మహాపండితులకు కొండవీడు నిలయమై ఎన్నో గ్రంథాలకు జీవమిచ్చిందన్నారు. ఘాట్‌రోడ్డులు తనకు ఎంతో నచ్చాయని, కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు పర్యాటకంగా కొండవీడును మరింత అభివద్ధి చేయాలని కోరారు. మ్యూజియంను ప్రైవేట్ స్థాయిలో నిర్వహించడం అభినందనీయమని, యాజమాన్యం మరిన్ని వస్తువులు మ్యూజియంలో ఏర్పాటు చేస్తే పర్యాటకులకు మరింత ఆసక్తిని కలిగించగలదని సూచించారు. ప్రదర్శనశాల వారు 'కొండవీడు' అనే గ్రంథాన్ని తులసిరెడ్డికి బహూకరించారు. కార్యక్రమంలో ప్రదర్శనశాల కన్వీనర్ బొడపాటి అంజిరెడ్డి, కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త ఎం రాధాకృష్ణ, యడ్లపాడు, నాదెండ్ల మండలాల కాంగ్రెస్‌పార్టీ నాయకులు, మ్యూజియం మేనేజర్ నారాయణరెడ్డి, ఉద్యోగులు కొండబోయిన వెంకటేశ్వరరావు, మరియమ్మ, కొండవీడుకోట కమిటీ కన్వీనర్ కల్లి శివారెడ్డి ఉన్నారు.



# భారతదేశంలో తొలి హెచ్ డీ ఆర్ బార్కో కలర్ గ్రేడింగ్ సౌకర్యం ఆవిష్కరణ

**శేరిలింగంపల్లి, జూన్ 3 (జనస్వరం) :** భారత సినీరంగాన్ని సాంకేతికంగా మరింత ముందుకు నడిపించే దిశగా మరో అడుగు పడింది. లేజర్ ప్రొజెక్షన్ టెక్నాలజీలో ప్రపంచ ప్రముఖ సంస్థ అయిన బార్కో మరియు సినిమా పోస్ట్ ప్రొడక్షన్‌లో అగ్రగామిగా నిలిచిన ప్రసాద్ ఫిల్మ్ లాబ్స్ సంయుక్తంగా భారతదేశపు మొట్టమొదటి హెచ్‌డీఆర్ బార్కో కలర్ గ్రేడింగ్ సదుపాయాన్ని మంగళవారం ఆవిష్కరించనున్నట్లు సంస్థలు ప్రకటించాయి. ఈ సాంకేతిక భాగస్వామ్యం ద్వారా, సినిమా పోస్ట్ ప్రొడక్షన్ ప్రక్రియను అత్యాధునిక ప్రమాణాలకు తీసుకెళ్లే అవకాశముందని నిర్వాహకులు వెల్లడించారు. "బార్కో హెచ్‌డీఆర్ లైటస్టీరింగ్ టెక్నాలజీ టూల్‌కిట్, లైట్‌బాక్స్, ఎల్ఎస్4-పీ ప్రొజెక్టర్ వంటి టెక్నాలజీల సహాయంతో ఈ కలర్ గ్రేడింగ్ సౌకర్యం రూపొందించబడింది," అని తెలిపారు. ఈ కలర్ గ్రేడింగ్ ప్రక్రియ ద్వారా దర్శకులు తమ కళాత్మక దృష్టిని మరింత ఖచ్చితంగా తెరపై సృష్టించగలరని, థియేటర్లలో ప్రదర్శించేప్పుడు అదే ప్రభావాన్ని ప్రేక్షకులు అనుభవించగలుగుతారని వారు పేర్కొన్నారు. ప్రసాద్ ఫిల్మ్ లాబ్స్ సీటీఓ అభిషేక్ ప్రసాద్ అక్కినేని మాట్లాడుతూ, "భారతదేశంలో హెచ్ డీ ఆర్ రంగులో చిత్రనిర్మాణానికి బార్కో సహకారంతో మేము మరింత విశ్వసనీయమైన, నాణ్యమైన పరిష్కారాలను అందించగలుగుతున్నాం. ఇప్పటికే కొన్ని ప్రధాన ప్రాజెక్టులు ఈ సదుపాయంలో పని ప్రారంభించాయి. త్వరలోనే ఈ టెక్నాలజీని భారత్ వ్యాప్తంగా విస్తరించనున్నాం," అన్నారు. ఈ సందర్భంగా బార్కో సినిమా ఈవీపీ జర్విన్ దామ్బ్రెగ్ మాట్లాడుతూ, "భారతదేశం సినీ వారసత్వానికి నిలయంగా ఉన్నది. అందుకే ప్రసాద్ లాబ్స్ వంటి సంస్థతో భాగస్వామ్యం చేసుకోవడం ద్వారా ప్రతి ఒక్కరికీ అత్యుత్తమ సినిమాను అందుబాటులోకి తీసుకురావడం మా లక్ష్యం. ఇది ఆ దిశలో వేసిన అర్థవంతమైన అడుగు," అని తెలిపారు. ఇటీవలి భాగస్వామ్యాల ద్వారా క్యూబ్, టిడిఐ వంటి సంస్థలతో కలసి బార్కో వచ్చే ఐదేళ్లలో 80 కొత్త హెచ్ డీ ఆర్ సినిమాలను భారత మార్కెట్లో ప్రవేశపెట్టాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ పరిణామం భారతీయ సినిమా సాంకేతికతకు మైలురాయిగా నిలవనుందని విశ్లేషకులు భావిస్తున్నారు.



# మాడుగుల మోదకొండమ్మ జాతరలో అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్

**అనకాపల్లి జూన్ 3 (జనస్వరం) :** ఉత్తరాంధ్ర జిల్లాల ఆరాధ్యదైవం మాడుగుల మోదకొండమ్మ పండుగ మహోత్సవం సందర్భంగా అమ్మవారి జాతరలో మాడుగుల శాసనసభ్యులు బండారు సత్యనారాయణమూర్తి తో కలసి మంగళవారం ఆలయంలో ప్రత్యేక కుంకుమ అభిషేక కార్యక్రమం లో రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్ అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు డాక్టర్ సీ.ఎం రమేష్ పాల్గొని పూజలు నిర్వహించారు. మండుటెండలను దృష్టిలో ఉంచుకొని ఆలయానికి వచ్చే భక్తులకు వడదెబ్బ తగలకుండా ఆలయం ముందు భాగంలో టెంట్లు, భక్తులకు అవసరమయ్యే అనేక ఏర్పాట్లు చేసిన కమిటీ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం భక్తులు ఇళ్లవద్ద పూజించిన ఘటాలతో ఆలయానికి చేరుకొని మొక్కులు చెల్లిస్తున్న మహిళలకు, కూటమి నాయకులకు అమ్మవారి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నట్లు తెలియజేశారు.



Owned by : Sake Naresh (Chairman) - 9642067900, Managed by : Jammu Sai Kalyan (Managing Director) - 7013030690,
REGD NO :APTEL 16144, Mail Id : janaswaramnews@gmail.com Dr.no : 9-35-4A, Illipilli Narasimha Rao Street, Opp KBN College, Kothapeta, Vijayawada - 520001.

## గత ప్రభుత్వం నిర్లక్ష్యం.. కూటమి ప్రభుత్వం నిధులిచ్చింది

**చిలకలూరిపేట, జూన్ 3 (జనస్వరం) :** చిలకలూరిపేటలోని ఏరియా (100 పడకల) ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం తాజాగా రూ.9.45 కోట్లు మంజూరు చేయడం పట్ల మాజీ మంత్రి, చిలకలూరిపేట శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నిధులతో ఆసుపత్రిలో విస్తృత స్థాయిలో పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఆసుపత్రి పరిస్థితిని పట్టించుకోలేదని ఆరోపించిన ప్రత్తిపాటి, "రోగులు, వైద్య సిబ్బంది ఎన్ని మారుమూల సమస్యలు చెప్పినా మునుపటి పాలకులు మౌనమే సాధించారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే సమస్యను నా దృష్టికి వచ్చిన వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాను. తగిన ప్రణాళికతో సమగ్ర నివేదికను రాష్ట్ర వైద్యారోగ్య శాఖకు అందించాం," అని చెప్పారు. ఆసుపత్రి ప్రాంగణంలో కాంపౌండ్ వాల్ నిర్మాణం, అంతర్గత సీసీ రోడ్లు, అంబులెన్స్ షెడ్, పార్కింగ్ షెడ్, బ్లడ్ బ్యాంక్, దోభీ ఘాట్ నిర్మాణాలు చేపట్టబోతున్నామని తెలిపారు. పాత భవనాల మరమ్మత్తులు, అవసరమైన వైద్య పరికరాల కొనుగోలు, జనరేటర్ మరియు ఆధునిక వంటగది (మోడర్న్ కిచెన్) ఏర్పాట్లు కూడా ఈ నిధులతో జరుగుతాయని వెల్లడించారు. గత అసెంబ్లీ సమావేశాల్లో ఈ ఆసుపత్రి పరిస్థితులపై తన ప్రస్తావనకు



స్పందించిన వైద్యారోగ్య శాఖ మంత్రి బిక్షపతి సత్యకుమార్ తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని ప్రత్తిపాటి గుర్తు చేశారు. దాని ప్రతిఫలంగా ఇప్పుడు రూ.9.45 కోట్లు మంజూరు అవడం ఆనందదాయకమన్నారు. "ప్రజల అవసరాలను గమనించి ఆసుపత్రి అభివృద్ధికి నిధులు విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి నియోజకవర్గ ప్రజల తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతున్నాను," అని ఆయన ప్రకటనలో పేర్కొన్నారు. అవసరమైన అన్ని అభివృద్ధి పనులు సకాలంలో పూర్తిచేసి, ప్రజలకు మెరుగైన వైద్యం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు.

## వెన్నుపోటు దినోత్సవం విజయవంతం చేయండి

**యలమంచిలి, జూన్ 3 (జనస్వరం) :** పట్టణంలో మంగళవారం యలమంచిలి పార్టీ కార్యాలయం నందు అనకాపల్లి జిల్లా పార్లమెంటరీ అధ్యక్షులు చోడవరం మాజీ శాసనసభ్యులు కరణం ధర్మశ్రీ, ఎలమంచిలి మాజీ శాసనసభ్యులు ప్రస్తుత సమన్వయకర్త యు.వి రమణమూర్తి రాజు (కన్నబాబు) ప్రెస్ మీట్ ఏర్పాటుచేశారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి బుధవారం నాటికి సంవత్సరం పూర్తవుతున్న ఎన్నికల హామీల లో భాగంగా ప్రజలకు హామీ ఇచ్చిన సూపర్ సిక్స్ అమలు చేయకపోవడంపై ప్రభుత్వంపై ప్రజల తరపున నిరసన తెలియజేయుటకై వెన్నుపోటు అనే కార్యక్రమాన్ని జూన్ 4వ తేదీన ఎలమంచిలి పార్టీ కార్యాలయం నుండి ర్యాలీగా వెళ్లి ఎమ్మార్వో కార్యాలయంలో వినతి పత్రం అందజేయనున్నామని, ఈ కార్యక్రమంలో యలమంచిలి నియోజకవర్గం నాలుగు మండలాల ప్రజాప్రతినిధులు, వివిధ హోదాల్లో ఉన్న నాయకులు



కార్యకర్తలు విద్యార్థులు ప్రజలు పెద్ద ఎత్తున ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని తెలియజేశారు. వారితో పాటు ఈ కార్యక్రమంలో బెజవాడ నాగేశ్వరరావు వైస్ చైర్మన్, ఆరేపు గుప్తా వైస్ చైర్మన్, జెడ్పిటిసి రాము సంధ్యారాణి, అచ్చుతాపురం మండల పార్టీ ప్రెసిడెంట్ మరియు దుత్తూరు సర్పంచ్ దేశం శెట్టి శంకర్రావు, మామిడివాడ మాజీ సర్పంచ్ సత్యనారాయణ, ఇతరులు పాల్గొన్నారు.

## యలమంచిలిలో మండల పరిషత్ సర్వసభ సమావేశం

**- ప్రజల కోసమే పని చేయాలి**
**- ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్**

**అనకాపల్లి, జూన్ 3 (జనస్వరం) :** యలమంచిలి మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జరిగిన సర్వసభ సమావేశం ఉత్సాహంగా కొనసాగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ ప్రజాప్రతినిధులకు పలు సూచనలు చేశారు. "ప్రజల కోసమే పని చేయాలి. నేను ప్రజల కోసం పనిచేయకపోతే, ఆ రోజే రాజీనామా చేసి వెళ్ళిపోతాను" అని స్పష్టంగా ప్రకటించిన ఆయన, ప్రతి నాయకుడు 'ప్రజలే మన శక్తి' అనే భావనతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. రాజకీయ పార్టీలకతీతంగా ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా అందరూ కలిసి పనిచేయాలన్నారు. పల్లెల్లో ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో అవగాహన పెరిగేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని ఆయన రేపారు. ప్రతి ప్రజాప్రతినిధి "సూపర్ సర్పంచ్"గా పేరు తెచ్చుకోవాలంటే తనతో కలిసి సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు.




ఈ సమావేశంలో ఎంపీపీ గోవింద్, మండల స్థాయి అధికారులు, గ్రామ సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు. స్థానిక అభివృద్ధిపై పలు అంశాలను చర్చించారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో సమష్టిగా ముందుకు సాగాలని అందరూ ఏకాభిప్రాయానికి వచ్చారు.

## రైతులకు అండగా కూటమి ప్రభుత్వం ఉంటుంది : ఎంపీ సీఎం రమేష్

**యలమంచిలి, జూన్ 3 (జనస్వరం) :** నియోజకవర్గ పరిధిలో రాంబిల్లి మండలం గోరపూడి గ్రామానికి చెందిన రైతులు అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు సీఎం రమేష్ ని, జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్య బాబు ని,రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్, యలమంచిలి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ ప్రగడ నాగేశ్వరరావు ని మర్యాదపూర్వకంగా కలిసి వారి సమస్యలను ఎంపీ కి విన్నవించారు. ఈ సందర్భంగా సీఎం రమేష్ మాట్లాడుతూ రైతులకు నష్టం కలిగించే చర్యలు మన ప్రభుత్వం ఏమాత్రం చేయబోవుదని, త్వరలోనే ఈ సమస్యను పరిష్కరిస్తామని, రైతులకు అండగా మన ప్రభుత్వం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో లాలం




తాతబాబు, నెక్కల నర్సింగరావు, లాలం రవికుమార్, లాలం రమణ, గొల్లి సతీష్ తదితరులు పాల్గొన్నారు

## రెవెన్యూ సదస్సులో 23 దరఖాస్తులు : తహశీల్దార్

**బొంరాస్ పేట, జూన్ 3 (జనస్వరం) :** మండల పరిధిలోని చౌదర్పల్లి, లింగంపల్లి గ్రామాల్లో మంగళవారం భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరిగిందని తహశీల్దార్ పద్మావతి తెలిపారు. మొత్తం 23 దరఖాస్తులు రాగా అందులో చౌదర్పల్లి 13,లింగంపల్లి 10 దరఖాస్తులు స్వీకరించామన్నారు.




## రైతులకు విత్తనాలు పంపిణీ

**బొంరాస్ పేట, జూన్ 3 (జనస్వరం) :** రైతులు వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు అందజేసే సలహాలు సూచనలు పాటించి అధిక దిగుబడులు పొందాలని వికారాబాద్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేష్ రెడ్డి అన్నారు.మంగళవారం రైతు వేదిక భవనంలో నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో





భాగంగా తాండూరు ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టర్ లక్ష్మణ్ తో కలిసి పాల్గొన్నారు. అనంతరం రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఏవో పోలప్ప,ఏఈవోలు స్వాతి,శైలజ, పవన్, జగదీష్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నర్సింలు గౌడ్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్ రాములు గౌడ్,నాయకులు రామ్ రెడ్డి మల్లేష్ రైతులు పాల్గొన్నారు.

## కొవ్వలిలో ఘనంగా మండల టిడిపి అధ్యక్షుడు మాగంటి నారాయణ ప్రసాద్ జన్మదిన వేడుకలు

**దెందులూరు, జూన్ 3 (జనస్వరం) :** మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మాగంటి నారాయణ ప్రసాద్ (మిల్లు బాబు )జన్మదిన వేడుకలు కొవ్వలి గ్రామంలో గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బగాతి చిన్నారావు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు వెలమాటి మోహనకృష్ణ, దెందులూరు మాజీ ఎంపీపీ పప్పుల సుశీల, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పూర్వ గ్రామ అధ్యక్షులు కసుకుర్తి రామకృష్ణ,బి రాజకూమార పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మాగంటి నారాయణ ప్రసాద్ జన్మదిన సందర్భంగా తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆధ్వర్యంలో భారీ కేక్ ను ఎన్టీఆర్ విగ్రహం వద్ద మిల్లు బాబు జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు గోవాడ నాగరాజు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు బలుసు శ్రీనివాసరావు, టిడిపి సీనియర్ నాయకులు ప్రముఖ న్యాయవాది వెద్దుళ్ల రాంబాబు,సాగు నీటి సంఘం అధ్యక్షులు నేరుసు వెంకటరమణ, రాజకుమార్, టిడీపి కోడురి బాబి, నవీన్ ,వీర్ల శ్రీనివాస్, నాగరాజు, రాజారావు, నాని పాత్రుని బాలమురళీకృష్ణ ,కనకరాజు కొవ్వలి అన్ని పేటల నుండి టిడిపి నాయకులు, మాగంటి నారాయణ ప్రసాద్ జన్మదిన వేడుకల్లో పాల్గొని ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



## బుద్ధ విగ్రహం పునఃప్రతిష్ఠ కోసం భైంసాలో రిలే నిరాహార దీక్ష — తొమ్మిదవ రోజు చేరిన పోరాటం

**భైంసా, జూన్ 3 (జనస్వరం) :** నిజామాబాద్ జిల్లాలో ముధోల్ మండలం బోరిగాం గ్రామంలో బుద్ధ విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించాలని కోరుతూ భైంసా పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద బుద్ధ అంబేద్కర్ విగ్రహ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష మంగళవారం తొమ్మిదవ రోజుకు చేరింది. సంఘ సభ్యులు, మాల సంఘాల నాయకులు ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొంటున్నారు. గత నెల 12వ తేదీన బుద్ధజయంతి సందర్భంగా అంబేద్కర్ సంఘం సభ్యులు కలిసి బోరిగాం గ్రామంలో ప్రభుత్వ భూమిలో బుద్ధ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అయితే, అదే స్థలంలో గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఇప్పటికే హనుమాన్ విగ్రహం స్థాపించి దాదాపు ఏడాది గడిచిన నేపథ్యంలో, ఈ కొత్త విగ్రహ ప్రతిష్ఠాపన కొందరికి అభ్యంతరకరంగా మారింది. బుద్ధ విగ్రహ ప్రతిష్ఠాపన జరిగి, పూజలు జరుగుతున్న సమయంలో గ్రామానికి చెందిన కొంతమంది అగ్రవర్ణ వర్గానికి చెందిన వ్యక్తులు వచ్చి రాళ్లతో దాడి చేశారని సంఘ సభ్యులు ఆరోపించారు. దీంతో రెండు వర్గాల మధ్య ఉద్రిక్తత నెలకొంది. పోలీసుల హస్తక్షేపంతో పరిస్థితిని శాంతింపజేసే ప్రయత్నం జరిగినా, రెండు వర్గాల వారికి కేసులు నమోదయ్యాయి. పలు అరెస్టులు జరగగా, కలహ కారణంగా గ్రామంలో ఉద్రిక్తత కొనసాగుతోంది. అయితే మాల సంఘాల ఆరోపణల ప్రకారం, బుద్ధ విగ్రహాన్ని స్థానిక అధికారులైన ఆర్డీఓ కొమల్ రెడ్డి, తహసీల్దార్ చొరవతో తొలగించి తహసీల్దార్ కార్యాలయంలో దాచి పెట్టారని తెలిపారు. మాల ప్రజలకు ఎలాంటి సమాచారం లేకుండానే బుద్ధ



విగ్రహాన్ని తొలగించడాన్ని వారు తీవ్రంగా ఖండిస్తున్నారు. బుద్ధ విగ్రహాన్ని అదే స్థలంలో తిరిగి ప్రతిష్ఠించాలన్న డిమాండ్‌తో భైంసాలో రిలే నిరాహార దీక్ష ప్రారంభమైంది. ఈ దీక్షకు పలు సామాజిక సంఘాలు మద్దతు ప్రకటించాయి. "ఇది కేవలం విగ్రహం అంశం మాత్రమే కాదు, మన ఆత్మగౌరవం కోసం పోరాటం" అని ఉద్యమకారులు స్పష్టం చేస్తున్నారు. "బుద్ధుడు శాంతి, సమానత్వానికి చిహ్నం. ఆయన్ని అవమానించడమంటే మా ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమే" అని మాల సంఘాల నాయకులు పేర్కొంటున్నారు. సంఘ సభ్యులు ప్రభుత్వాన్ని, సంబంధిత అధికారులను స్పందించి బుద్ధ విగ్రహ పునఃప్రతిష్ఠకు అనుమతి ఇవ్వాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## పాత కక్ష కారణంగా దాడి — బైక్ దొంగలించిన ఇద్దరు అరెస్ట్

**కైకలూరు, జూన్ 3 (జనస్వరం) :** మండలంలోని ఆటపాక గ్రామ శివారులో పాత కక్షలు కారణంగా దాడి చేసి, బైక్ దొంగిలించిన కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు కైకలూరు టౌన్ ఇన్స్పెక్టర్ పి. కృష్ణ వెల్లడించారు. బాధితుడు మర్రి రాము ఫిర్యాదు మేరకు తక్షణమే స్పందించిన పోలీసులు నిందితులను అరెస్టు చేసి, వారి వద్ద నుండి అపహరించిన బుల్లెట్ బైక్, చాకును స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే... మే 31వ తేదీన ఆటపాక గ్రామానికి చెందిన మర్రి రాము తన వ్యక్తిగత పనుల నిమిత్తం తన స్థలం వద్దకు వెళ్లి తిరిగి వస్తుండగా, జాన్‌పేటకు చెందిన కుమ్మరిగుంట మదన్ కుమార్ మరియు రాయినూతల విజయ్ అనే ఇద్దరు వ్యక్తులు పాత కక్షలు కారణంగా రామును దేవుడు మాన్యం చెరువు వద్ద అడ్డగించి బైక్ తాళం ఇవ్వమని బెదిరించారు. రాము నిరాకరించడంతో నిందితులు అతనిపై దాడికి పాల్పడి, మదన్ కుమార్ చాకుతో బెదిరించి బలవంతంగా తాళం తీసుకొని బుల్లెట్ బైక్‌ను అపహరించాడు. బాధితుడు చేసిన కేకలు విని సమీప గ్రామస్తులు అక్కడికి చేరుకుని రామును కాపాడగా, నిందితులు బైక్‌తో పరారయ్యారు. అనంతరం రాము ఇచ్చిన ఫిర్యాదుతో కైకలూరు టౌన్ ఎస్సై వెంకట్ కుమార్ కేసు నమోదు చేసి, ప్రత్యేక దర్యాప్తు చేపట్టారు.కేసులో గాంభీర్యాన్ని దృష్టిలో ఉంచుకొని, పోలీసులు తక్షణమే నిందితుల కదలికలను గుర్తించి, మదన్ కుమార్, విజయ్‌లను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి బుల్లెట్ బైక్, దాడికి ఉపయోగించిన చాకును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను కైకలూరు గౌరవ న్యాయస్థానానికి హాజరుపరిచిన పోలీసులకు, కోర్టు 14 రోజుల న్యాయహిరాసత్ విధించింది. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ పి. కృష్ణ మాట్లాడుతూ, "ఇలాంటి చట్ట విరుద్ధ కార్యకలాపాలు ఎక్కడైనా గమనించినచో వెంటనే డయల్ 112 లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలి. పోలీసులు 10 నిమిషాల్లో స్పందించి బాధితులకు సహాయం అందిస్తారు" అని తెలిపారు.




## జన సైనికుల కుటుంబాలకు జనసేన భీమాతో ఆర్థిక భరోసా

**జనసేన పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మేడిశెట్టి సూర్యకిరణ్**

**శంఖవరం, జూన్ 3 (జనస్వరం) :** విధి వంచితులైన జనసేన పార్టీ సభ్యత్వం కలిగిన జనసైనికులు ప్రమాదవశాత్తు మరణిస్తే, వారి కుటుంబాలను ఆదుకునేందుకు బీమా సౌకర్యం ద్వారా ఆర్థిక భరోసాను జనసేన పార్టీ కల్పిస్తుందని పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మేడిశెట్టి సూర్య కిరణ్ (అంబికా బాబి) అన్నారు. మంగళగిరిలోని ఆర్అర్ఆర్ కన్వెన్షన్ లో జరిగిన పార్టీ కార్యక్రమంలో జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ కొణిదల నాగబాబు, ప్రభుత్వ శాసనమండలి విప్ పిడుగు హరిప్రసాద్ చేతుల మీదుగా జనసైనికులలోని బాధిత కుటుంబాలకు భీమా చెక్కులను పంపిణీ చేశారు. ఈ చెక్కులలో ప్రత్తిపాడు నియోజకవర్గంలోని ధర్మవరం గ్రామానికి చెందిన బెజవాడ భాస్కరరావు, పెద్ద మల్లాపురం గ్రామానికి చెందిన బోనం సుబ్రహ్మణ్యం కుటుంబాలకు ఒక్కొక్కరికి ఐదు లక్షల చొప్పున భీమా చెక్కులను నాగబాబు అందజేశారు. ఈ సందర్భంగా బాబి మాట్లాడుతూ రాష్ట్రంలో పేదలకు, రైతులకు కష్టమొస్తే తన సొంత నిధులను వెచ్చించి, ఆదుకున్న ఘనత జనసేనాని పవన్ కళ్యాణ్ కే దక్కుతుందన్నారు.



జనసేన పార్టీ జనసైనికుల కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విజయంలోనూ, అరాచక వైసిపి ప్రభుత్వాన్ని గద్దె దింపడంలోనూ జనసేనాని పవన్ కళ్యాణ్ కీలక పాత్ర పోషించారన్నారు. వైసిపి పాలన నుండి విముక్తి పొంది, కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా రాష్ట్ర ప్రజలు ఆనందంతో జూన్ 4న ఉత్సవాలు జరుపుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో శంఖవరం మండలం పార్టీ అధ్యక్షుడు గాబు సుభాష్, ఉపాధ్యక్షుడు తలపంటి బుజ్జి, రెడ్డిపల్లి మధు, కోలా నాగబాబు, గల్లా నాని, కొరుప్రోలు రమేష్, జర్తా సరస్వతి, మాడెం లక్ష్మణ్, జర్తా శ్రీను, గూడెం పండు, లోవరాజు అధిక సంఖ్యలో జనసైనికులు పాల్గొన్నారు.

## గుంతకల్‌లో సంక్రాంతి–దీపావళి కలబోసిన వేడుకలు

**గుంతకల్, జూన్ 3, (జనస్వరం) :** జూన్ 4వ తేదీని సంక్రాంతి మరియు దీపావళిల కలబోసిన పండుగలా జరుపుకోవాలని జనసేన పార్టీ గుంతకల్ నియోజకవర్గ బాధ్యుడు వాసగిరి మణికంఠ పిలుపునిచ్చారు. ఈ రోజు రాష్ట్రానికి మంచి పాలన ప్రారంభమైన రోజు, అలాగే ప్రజలకు పీడ విరగడైన రోజు అనే భావనతో పండుగ వాతావరణాన్ని ఏర్పరచాలని ఆయన సూచించారు. గత సంవత్సరం జూన్ 4, 2024న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి ప్రజల తీర్పుతో అఖండ విజయాన్ని సాధించింది. మొత్తం 164 స్థానాలు గెలుచుకొని వైసీపీ ప్రభుత్వానికి తెరదించింది. వైసీపీ కేవలం 11 స్థానాలకు పరిమితమైంది. జనసేన పార్టీ మాత్రం 21 స్థానాల్లో 21 విజయాలతో 100% స్ట్రైక్ రేట్ సాధించి రాష్ట్ర రాజకీయాల్లో శక్తివంతమైన పాత్ర పోషించింది. పవన్ కళ్యాణ్ నాయకత్వంలో ప్రజల సమస్యలపై పోరాటాలు, శ్రామికుల హక్కుల కోసం సాగిన ఉద్యమాలు ప్రజల్లో నమ్మకాన్ని కలిగించాయి. అదే నమ్మకంతో ప్రజలు ఎన్డీఏకు పట్టం కట్టారు. రాష్ట్రంలోని పాలనకు మార్గదర్శకత్వం ఇచ్చిన రోజు జూన్ 4నే కావడంతో, ఈ రోజును ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని జనసేన నాయకులు నిర్ణయించారు.



గుంతకల్ పట్టణంలో ఎన్డీఏ నాయకులు, కార్యకర్తలు ఉదయం రంగవల్లులు, సాయంత్రం దీపాల వెలుగులు, బాణాసంచా, మొగ్గుల పోటీలు వంటి పలు కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఈ వేడుకల్లో ప్రతి కుటుంబం, ప్రతి జనసైనికుడు, ప్రతి వీరమహిళ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఇవన్నీ సోషల్ మీడియాలో విస్తృతంగా పంచుకొని, ఎన్డీఏ ప్రభుత్వ విజయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని వాసగిరి మణికంఠ సూచించారు. ఇది గుంతకల్ నియోజకవర్గం మాత్రమే కాదు, రాష్ట్రం మొత్తానికి ప్రజాస్వామ్య విజయ దినోత్సవంగా గుర్తుండేలా చేయాలని అన్నారు.